www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 9 విజయవాడ 5-9-2011 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...

- పది ప్రధాన సంబంధాలు-మావో
- బ్రిటన్‌లో దహనకాండ : దోపిడీ వ్యవస్థపై యువత ప్రతీకారం
- రైతులకందని పంట రుణాలు
- కార్మికులను బానిసత్వంలోకి దించే నూతన ఉత్పత్తి విధానం
- బీడీ కార్మికులను మరోమారు వంచించిన ప్రభుత్వము, యాజమాన్యాలు
- భావనపాడు బీచ్‌శాండ్ ప్రాజెక్ట్ : ఇసుక త్రవ్వకాలకు పాలకుల అనుమతి
- ఎరువుల ధరలకు రెక్కలు తొడిగిన ప్రభుత్వం

## పాలకుల, పాలకవర్గాల, ఉన్నతాధికారుల అవినీతికి వ్యతిరేకంగా పోరాడుదాం

**గత** 64 ఏళ్ల కాలంలో పాలకుల, పాలకవర్గాల పాలన 'అవినీతి గుంట పూలు' పూస్తున్నది. సామాజిక అణచివేత, పీడనల క్రింద; శ్రమశక్తి , శ్రమ ఫలితాల దోపిడీల క్రింద నలిగిపోతూ వున్న కార్మికవర్గం, శ్రామిక ప్రజానీకం పాలకుల, పాలనా వ్యవస్థ చేతులలోని ఈ అవినీతి కొరడా దెబ్బలతో మరింత గాయపడిపోతూ వున్నారు.

1950లలో మొదలైన హరిదాస్ ముంద్రా కుంభకోణం నుండి ప్రారంభిస్తే 2జి కుంభకోణం వరకూ పాలకవర్గాల, పాలకుల కుంభకోణాల జాబితా లెక్క పెట్టలేనంతటిది. ప్రస్తుత యుపిఏ కూటమి పాలన కాలంలో స్పెక్ట్రం కుంభకోణం (లక్షలకోట్ల రూ॥), కామన్వెల్త్ ఆటల కుంభకోణం (వేల కోట్ల రూ॥), గ్రామీణ ఉపాధి హామీ పథకం (వందల కోట్లరూ॥), డిమాట్, జలాంతర్గామి కొనుగోలు కుంభకోణం, సైనికుల రేషన్ దొంగిలింపు కుంభకోణం, సత్యం కంపెనీ కుంభకోణం మొదలైనవి బయటపడ్డాయి.

గత ఎన్‌డిఏ కూటమి పాలనలో శవపేటికల కుంభకోణం, ఆయుధ సామాగ్రి కొనుగోళ్ల కుంభకోణం, తెహల్కా ద్వారా బయల్పడిన నాయకుల కమీషన్ల కుంభకోణం, గత- ప్రస్తుత కూటముల పాలనలో కొనసాగిన ఆదర్శ (కోట్ల ఖరీదు చేసే ఫ్లాట్ల కైవశం) కుంభకోణం రచ్చరచ్చ అయింది.

ఇక రాష్ట్రాలకు వస్తే బీహార్‌లో గడ్డి కొనుగోలు కుంభకోణం, ఉత్తరప్రదేశ్‌లో ఆయుర్వేద మందుల కొనుగోళ్ల కుంభకోణం, తాజ్ కారిడార్ కుంభకోణం, మధ్యప్రదేశ్‌లో ధాల్ కుంభకోణం, జార్ఖండ్‌లో కోడా డబ్బు తరలింపు కుంభకోణం, ఒరిస్సాలో వేదాంత, టాటా, పోస్కోలకు భూముల కేటాయింపుల కుంభకోణం, కేరళలో వంటనూనెల దిగుమతి, లవలీన్ కుంభకోణం, కర్ణాటకలో మైసూర్ హైవే కారిడార్ కుంభకోణం, ఇనుప గనుల కుంభకోణం, తమిళనాడులో జయలలిత, కరుణానిధిల పాలనల్లో వరుస కుంభకోణాలు, ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞం కాంట్రాక్టుల్లో కుంభకోణం-అన్నింటినీ మనం చూస్తూనే వున్నాం.

మన్మోహన్-సోనియాల పాలనలో 1,75,784 కోట్ల రూ॥ల సంపద వివిధ కుంభకోణాల ద్వారా అధికార పార్టీ నాయకులకూ, ఉన్నతాధికారులకూ చేరితే అందుకు ఎన్నో రెట్లు అధికంగా సంపద పాలక వర్గాలకు చేరింది. ఇక వాజ్‌పాయ్-అద్వానీల పాలనలో బయటపడ్డ కుంభకోణాల వరకే లెక్కవేసినా, పాలకులకు చేరిన సంపద వేల కోట్ల రూ॥లు వుంది.

నాగర్ వాలాకు డబ్బు చెల్లించమని అడిగిన ఇందిరాగాంధి గొంతు గురించి విన్నాం. మారుతీ కార్ల లైసెన్సు సంజయ్‌గాంధీకి యిచ్చిన సంగతీ విన్నాం. భోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్లలో ముడుపుల గురించి విన్నాం. భోఫోర్సుపై విచారణ కొనసాగించవద్దని స్విట్జర్‌లాండ్ విదేశాంగ మంత్రికి భారత విదేశాంగ మంత్రి సోలంకి విజ్ఞప్తి మనకు తెలిసినదే. ఉనికిలో లేని కంపెనీలకు ఇంధన నూనె దిగుమతులకు ముందు చెల్లింపుల గురించి విన్నాం. జర్మన్ జలాంతర్గాముల కొనుగోళ్లలో ముడుపుల గురించి విన్నాం. విమానాల కొనుగోళ్ళలో ముడుపుల గురించి విన్నాం. షేర్ల కుంభకోణం, చక్కెర దిగుమతి కుంభకోణం గురించి విన్నాం. పార్లమెంటు సభ్యులను డబ్బు సంచులతో కొనివేసి అవిశ్వాస తీర్మానం నుండి గట్టెక్కిన పి.వి.నరసింహారావు ప్రభుత్వం గురించీ విన్నాం. టెలికాం కుంభకోణం, యూరియా దిగుమతి కుంభకోణం, హర్షద్ మెహతా కుంభకోణం, తెల్గి కుంభకోణం గురించీ విన్నాం. ఈ వరసలోనే పార్లమెంటు సభ్యుల నియోజక వర్గ అభివృద్ధి నిధుల కైంకర్యం గురించీ విన్నాం.

'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం...నరహంతకులు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి' అన్న చందంగా పాలకులు ఏ ముఠాకు చెందినా, ఏ పార్టీకి చెందినా, ఏ కూటమికి చెందినా అవినీతి దారిలో పయనించి, ప్రజా సంపదలను కైంకర్యం చేయటం రివాజుగా మారిపోయింది.

జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో సాగిన అవినీతి వ్యతిరేక పోరాటంలో ముందుకు వచ్చిన నాయకుల్లోని రెండవ శ్రేణి అవినీతిని ఆహార్యం చేసుకుంటే, భోఫోర్స్ కుంభకోణం తర్వాత ఉన్నతస్థాయిలో అవినీతికి వ్యతిరేకంగా విపి సింగ్ నాయకత్వాన ముందుకు వచ్చిన నాయకులందరూ అవినీతినే ఆహార్యంగా స్వీకరించారు.

మన రాష్ట్రంలో చంద్రబాబు అవినీతికి వ్యతిరేకంగా రాజశేఖరరెడ్డి, అతని అవినీతికి వ్యతిరేకంగా చంద్రబాబు సాగించిన ఆందోళనలు గమనించితే, పాలకుల, పాలకవర్గాల, ఉన్నతాధికారుల అవినీతి ఎంతగా పేరుకున్నదో అర్థమౌతుంది.

కరువు తాండవించి, పొట్ట చేత పట్టుకుని అల్లాడుతున్న ప్రజలకు అందాల్సిన నిధులు, ఆహారంతో అవినీతిపరుల జేబులు నిండుతున్నాయి. వరదలు వచ్చి, ఆప్తులనూ, ఆస్తులనూ కోల్పోయి అలమటిస్తున్న ప్రజలకు సహాయ నిధులు, సంభారాలూ, అవినీతి పాలకుల అక్రమార్జనలను వరదలా పెంచుతున్నాయి. రైతులు సాగురుణాల కోసం, కౌలు రైతులు మందుకట్టల కోసం, గ్రామీణ పేదలు పని కోసం, వృత్తిదారులు బ్యాంకురుణాల కోసం, చిన్న వ్యాపారులూ, సొసైటీలు లావాదేవీల కోసం ఎక్కడికి వెళ్లినా అవినీతే ముందుగా ఎదురౌతున్నది. ఎక్కడెక్కడ సాగుతూన్నా పుచ్చుకునేది చిన్న ఉద్యోగి అయినా మూలాలు మాత్రం పాలకుల వద్దా ఉన్నతాధికారుల వద్దా వున్నాయి.

చివరకు రేషను కార్డుల జారీ అయినా, ఆధార్ కార్డుల జారీ అయినా ప్రజలకు ప్రయాస తప్పదు. పాలకులూ, ఉన్నతాధికారులూ రూపొందించిన ఏ కార్యక్రమమైనా వారికి పేరు ప్రఖ్యాతులూ, సంపదలూ సమకూర్చిపెడతాయి; తమ కష్టార్జితాన్ని ధారపోసుకోవటమే ప్రజలకు మిగులుతుంది.

ఇది ప్రత్యక్షంగా సాగుతున్న అవినీతి; పరోక్షంగా సాగుతున్న అవినీతి విశ్వరూపం ప్రజల జీవితాలను పట్టి పల్లారుస్తున్నది. పైన పేర్కొన్న కుంభకోణాలన్నీ ఈ తరహాకు చెందినవే. ఇది ప్రజల జీవితాలను ఎలా కష్టాల మయం చేస్తున్నదో సూటిగా కన్పించదు. కానీ ప్రజలకు చెందవలసిన సంపదనంతా పాలకులు దోచుకుతింటున్నారు. **(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

## సమాధులు వెల్లడి చేస్తున్న వాస్తవాలు

**స్వయం** నిర్ణయాధికార హక్కును కోరుతున్న కాశ్మీరీ ప్రజలను అణచివేసేందుకు అప్రకటిత సైనిక పాలనను కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్నది. సరిహద్దుల ఆవలి నుండి వస్తున్న టెర్రరిజాన్ని అణచేపేరిట కాశ్మీరు ప్రజలపై నిరంకుశ పాలన సాగిస్తున్నది. పాలకుల పాశవిక క్రూరత్వం సమాధుల నుండి బయట పడింది.

కాశ్మీరులోని అనేక హక్కుల సంఘాలూ, సంస్థలూ "అదృశ్యమైన" పౌరుల ఆచూకీ తెలపాలని అందోళన సాగిస్తున్నాయి. ఏ కారణమూ చెప్పకుండానే సైనికదళాలు పట్టుకుపోయిన 8 వేల మంది వ్యక్తులు అదృశ్యమైపోయారనీ, వారి ఆచూకీ తెలియటంలేదనీ, రాష్ట్ర మంతటా వున్న పేరులేని సమాధులకూ, ఈ అదృశ్యాలకూ సంబంధం వుందనీ, అవి ఆరోపిస్తూ వస్తున్నాయి. 2008 ఏప్రిల్‌లో "అదృశ్యవ్యక్తుల తల్లిదండ్రుల సంఘం" (ఎపిడిపి) బారాముల్లా జిల్లాలోని సమాధులను సర్వే జరిపి "భూమిలోపల వాస్తవాలు" అన్న నివేదికను వెలువరించింది. 2009 అక్టోబరులో "కాశ్మీరులో మానవ హక్కులు, న్యాయంపై అంతర్జాతీయ ప్రజా ట్రిబ్యునల్" విస్తారమైన వివరాలతో "పాతిపెట్టిన సాక్ష్యాలు" అన్న నివేదికను వెలువరించింది. బందిపురా, బారాముల్లా, కుప్వారా జిల్లాల్లో 57 చోట్ల వున్న సమాధులలో 2373 పేరులేని మృత శరీరాలున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ గుర్తించని శవాలను రాత్రిపూట తెచ్చి, కాల్పులలో మరణించిన మిలిటెంట్లు గనుక గుర్తించవీలు కాలేదని చెప్పి సైనిక దళాలు పూడ్చిపెట్టించాయని సమాధులు త్రవ్వేవారు. ఇతర ప్రత్యక్ష సాక్షుల కథనాలను ఈ నివేదిక రికార్డు చేసింది. ఈ సమాధుల గురించి ప్రజలందరికీ తెలిసినప్పటికీ, భయంతో ఇన్నాళ్లూ ఎవరూ దాని గురించి మాట్లాడలేదని కూడా తెలిపింది. 1989 నుండి 2009 వరకూ ప్రభుత్వమూ, దాని సైనిక దళాలూ కాశ్మీరు ప్రజలపట్ల ఎంతటి శతృపూరిత వైఖరితో వ్యవహరించాయో ఈ నివేదికలు వెల్లడించాయి.

ఈ నివేదికలను తెలుసుకున్న జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ నోటీసులు జారీ చేసి ఒక సీనియర్ ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశోధనా టీమ్ (సిట్)ను నియమించి గుర్తులేని సమాధుల గురించి విచారించమని ఆదేశించింది. 'సిట్' తన నివేదికను సమర్పించింది. సమాచార హక్కు క్రింది 'సిట్' నివేదికను అందించమని కొన్ని సంస్థలు కోరటంతో అది ఇటీవల వెలుగులోకి వచ్చింది.

'సిట్' నివేదిక ట్రిబ్యునల్ చెప్పిన అంశాలను నిర్ధారించింది. పైగా టిబ్యునల్ 57 చోట్లచెప్పిన దానికన్నా ఎక్కువ మంది 38 సమాధులలో ఉన్నట్లు నిర్ధారించింది. వారి సంఖ్య 2730. వీరిలో 574 మందిని స్థానికులుగా గుర్తించింది. ఇంకా 2156 మందిని గుర్తించాల్సివుంది.

రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనే బయటపడ్డ ఈ మృతుల సంఖ్య అసలు సంఖ్యలో చాలా కొద్ది మాత్రమే. షోపియాన్, శ్రీనగర్, అనంత్‌నాగ్, బుద్గామ్, గందర్‌బల్, దోడా, పూంఛ్, రాజౌరీ, జిల్లాల్లో ఇంకా బయటపడని సమాధులుండి వుంటాయని మానవ హక్కుల కమీషన్ భావిస్తున్నది. "ఇంకా గుర్తించని శవాలలో అదృశ్యమైన వ్యక్తులుండి వుంటారని" సిట్ అభిప్రాయపడింది. అంతే కాక "ఈ గుర్తించని శవాలు అదృశ్యమైన వ్యక్తులవేనన్న ఆరోపణలనూ, అనుమానాలనూ తీర్చివలసిన ప్రధాన బాధ్యత మానవ హక్కులను, చట్టాన్ని కాపాడవలసిన ప్రజాస్వామిక ప్రభుత్వానిదే"నని అభిప్రాయపడింది.

సిట్ నివేదిక రెండు అంశాల రీత్యా ప్రాధాన్యత కలిగివుంది. ఇన్నాళ్లుగా అనేక సంస్థలుచేస్తున్నట్లుగా అదృశ్య వ్యక్తులు సమాధులలోకి చేరారన్న ఆరోపణలను నిర్ధారించింది. రెండు ట్రిబ్యునల్ కనుగొన్న నిర్దిష్ట ఆధారాలను కూడా నిర్ధారించింది. దీనికనువుగానే అదృశ్యవ్యక్తుల కుటుంబాల, శవాల డిఎన్‌ఏలను పరిశీలించి, వాటిని గుర్తించే ఏర్పాట్లు చేయాలనీ, శవ పరీక్షలు జరిపి మరణకారణాలను గుర్తించాలనీ మానవ హక్కుల కమీషన్ ప్రభుత్వానికీ సూచించింది. కమీషన్ తన నివేదికను సెప్టెంబరు నెలలో ప్రభుత్వానికి అందజేయనుంది.

ప్రభుత్వం అప్పుడైనా చర్యతీసుకుంటుందో లేదో, వేచి చూడాలి. అయితే సాక్ష్యాధారాలతో ఇన్నాళ్లుగా ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టించుకోకుండానే వున్నది. అదృశ్యమైన వ్యక్తులు ఏమయ్యారో తెలియక తాము భర్తవిహీనులమో కామో తెలియని డోలాయమాన స్థితిలోవున్న మహిళల మానసిక వ్యధ వారినేమాత్రం కదలించలేకపోయింది. దీనిపై విచారణ కొనసాగించటం ఉద్రిక్తతలను పెంచుతుందనటం బోడిగుండుకూ మోకాలుకు ముడిపెట్టే ప్రయత్నమే. భారత రాజ్యం కాశ్మీరు ప్రజలనుండి ఎంతగా వేరుపడిపోయిందో షోపియాన్‌లో గత ఏడాది సాగిన ప్రజానిరసనే తెలుపుతుంది.

టెర్రరిజాన్ని అణచివేయటం పేరిట అమాయక పౌరులను నిలువునా చంపివేసిన రాక్షసకృత్యాలు మళ్లీ సాగకుండా చర్యలు తీసుకోకుండా సమస్య పరిష్కార క్రమానికి సహకరించమని పాలకులు చేసే విజ్ఞప్తులు కాశ్మీరు ప్రజలలో ఎలాంటి విశ్వాసాన్ని నెలకొల్పలేవు. కాశ్మీరు ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును గుర్తించటంతోపాటు, కాశ్మీరు ప్రజలపై సాగిస్తున్న దమనకాండను తక్షణమే ఆపివేయాలని ప్రజాస్వామికశక్తులు డిమాండు చేయాలి. కాశ్మీరు ప్రజలు స్వచ్ఛందంగా భారత యూనియన్‌లో వుండాలని పాలకులు నిజంగా కోరుకుంటుంటే, వారి ముందున్న ప్రజాస్వామిక పరిష్కారమిదే. దానికి ముందు చర్యగా తక్షణమే అదృశ్యవ్యక్తుల, గుర్తుతెలియని సమాధుల విచారణను పూర్తిచేసి, దోషులను శిక్షించి, ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. D

# మార్క్సిస్టు చరిత్రకారుడు ప్రొఫెసర్ ఆర్.యస్.శర్మకు జోహార్లు

**ప్రాచీన** భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను మార్క్సిస్టు దృక్కోణంలో పరిశీలించి, విశ్లేషించిన ప్రముఖ చరిత్రకారుడు, పరిశోధకుడు, ప్రొఫెసర్ ఆర్.యస్ శర్మ 20-8-11న మరణించారు. మరణించే నాటికి ఆయన వయస్సు 92 సంవత్సరాలు.

దేశాన్ని పట్టి కుదుపుతున్న కులం, మతం, తదితర అంశాలపై సైద్ధాంతిక స్థాయిలో విశ్లేషించేందుకు, సరైన అర్థంలో లౌకికవాదాన్ని ఆచరించవలసిన అవసరాన్ని నొక్కిచెప్పేందుకు ఆయనేనాడూ వెనుకాడలేదు.

అయోధ్య ఉదంతంలో ఇమిడివున్న మతతత్వ ప్రమాదాన్ని తొలిగా పసిగట్టిన చరిత్రకారుడు ఆర్.యస్.శర్మ. భారత హిస్టరీ కాంగ్రెస్‌ను లౌకిక ప్రజాస్వామిక దృక్పథంతో నడిపేవిధంగా ఆయన ప్రయత్నించారు.

1975లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ ఛైర్మన్‌గా ఉన్న శర్మ ఆలీఘడ్‌లో జరిగిన ఆనాటి భారత హిస్టరీ కాంగ్రెస్ సమావేశంలో 'అత్యవసర పరిస్థితి'కి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించటంలో కీలకపాత్ర వహించారు.

ప్రజాస్వామ్య, లౌకిక దృక్పథంతో చరిత్రను విశ్లేషించటమేకాక, ఆయా విశ్లేషణలతో ఆయన రూపొందించిన పాఠ్యగ్రంథాలకు వ్యతిరేకంగా హిందూ మతతత్వవాదుల తీవ్రమైన దాడిని కూడా ఎదుర్కొన్నారు.

భారతదేశ ప్రాచీన చరిత్రను, బానిస, ఫ్యూడల్ వ్యవస్థల పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా అవగాహన చేసుకునేందుకు ప్రొఫెసర్ శర్మయొక్క 'ప్రాచీన భారతంలో శూద్రులు', 'భారతీయగతం-దాని ఫ్యూడలిజం' వంటి పలు రచనలు తోడ్పడతాయి.

మేధావిగా, భేషజాలకు పోకుండా మార్క్సిస్టు సిద్ధాంత నిబద్ధతతో కృషిచేసిన ప్రొఫెసర్ ఆర్.యస్.శర్మకు 'జనశక్తి' నివాళులర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నది.

D

**పాలకుల...** (మొదటి పేజీ తరువాయి)

ఇనుప ఖనిజంలో గాలి సోదరుల అక్రమార్జనలు, వాటిలో వాటాలు పుచ్చుకున్న అటు కర్ణాటకలో బిజెపి ప్రభుత్వమూ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు ప్రభుత్వమూ, దాదాపు 50 గ్రామాలను నివాసయోగ్యం కాకుండా చేసి ప్రజలను తరిమివేశాయి; లాభాల వేట పరుగులో 500ల మందికి పైగా ప్రజలు లారీల క్రిందపడి అసువులు బాశారు; ఇనుప ఖనిజాన్ని ఎగుమతిచేసి వేల కోట్ల రూ॥లతో బొజ్జలు నింపుకున్నారు. ఇలా కాక అక్కడే ఒక ఉక్కు మిల్లు ప్రభుత్వం పెట్టి వుంటే, కనీసం పాతికవేల మందికి అందులో ఉద్యోగం లభించేది; ఖనిజం బదులుగా ఉక్కును దేశంలో అమ్మినా, ఎగుమతి చేసినా అధిక ఆదాయం వచ్చి వుండేది. ఆ అధిక ఆదాయాన్ని సంక్షేమ చర్యలకు వినియోగించుకోగలిగేవారు. అలాగే సహజ వాయువు ఒఎస్‌జిసి వెలికితీసి వుంటే అమ్మే ధర కంటే మూడు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు అంబానీకి అనుమతినిచ్చి పాలకులు తమ జేబులు నింపుకున్నారు. ఈ సహజ వాయువు ఉపయోగించి ఉత్పత్తి అయ్యే ప్రతి సరుకుకూ (విద్యుత్తు, ఎరువులూ తదితరాలు) అధిక ధరలు చెల్లించి నష్టపోగా అంబానీ మాత్రం లాభాల అంతస్తులతో ఆకాశహర్మ్యాలు నిర్మించుకుంటున్నాడు. ఈ దేశ సహజ సంపదలను కొల్లగొట్టుకోవటం కోసమే దేశంలోని దోపిడీ పాలకవర్గాలూ, విదేశీ పెట్టుబడిదారులూ అవినీతి, అక్రమార్జనలను ప్రోత్సహించి, రాజకీయ, పాలనా వ్యవస్థలను తమ గుప్పెటలో పెట్టుకుని ఆడిస్తున్నారు.

ఫలితం-పేద ప్రజల బిడ్డలకు చదువు నేర్పేందుకు ప్రభుత్వానికి నిధులుండవు. ప్రాథమిక విద్యారంగానికి నిధుల కొరకు ప్రపంచ బ్యాంకు ముందు బొచ్చె పట్టుకుని నిలబడుతుంది. ప్రజలకు వైద్య సేవలందించేందుకు నిధులుండవు. విదేశీ బీమా కంపెనీలను రప్పించి, వారికి వ్యాపారం సమకూరే వరకూ, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య బీమా కట్టడం తప్ప మరోదారి లేకుండా చేయటంతోపాటు ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో వాటికి నిధులు సమకూర్చుతారు. మిగిలిన పేదలు బీమా కట్టలేక అనారోగ్యం పాలిటబడి కునారిల్లిపోవాలి.

మరోవైపున మన సహజవనరులను (ఉదా: బాక్సైటు) తరలించుకు వెళ్లిన సామ్రాజ్యవాదులు, దాని నుండి వచ్చిన ఉత్పత్తులను (అల్యూమినియం) మనకే అధిక ధరలకమ్మి లాభాలు చేసుకుంటున్నారు. ఈ తరలింపు, అమ్మకాలలో దళారీలుగా వ్యవహరించి భారత బూర్జువాలూ, నేతలూ, అధికారులూ వేల కోట్ల రూపాయలను స్విస్‌బ్యాంకు ఖాతాల్లో దాచుకుంటున్నారు. ఈ క్రమంలో దేశం నిర్భాగ్యమౌతుంది, ప్రజలు అభాగ్యులౌతారు.

ఈ వాస్తవం ప్రజలకు అర్థం కాకుండా చేయటానికి ఈ దారి దోపిడీ దొంగలే పూనుకుంటారు, విద్యాహక్కు నిస్తామంటారు; ఆహార హక్కునిస్తామంటారు; పని హక్కు నిస్తామంటారు; ఆశల పందిళ్లు వేస్తారు. అయితే గోదాముల్లో ఆహారధాన్యాలు ముక్కిపోతాయి తప్ప ప్రజల ఆకలి తీరదు; విద్యానిధుల ఖర్చు లెక్కలు పెరుగుతుంటాయి తప్ప అక్షరాలు కూడా చదవటం రాని పిల్లల సంఖ్య పెరుగుతూనే పోతుంది. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు పెరుగుతాయి కానీ నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూనే పోతుంది. ఈ కల్పించిన ఆశలు కూడా ఆవిరైపోతే పెరిగే అశాంతి బ్రద్దలు కాకుండా తామే పోరాటాలు మొదలుపెడతారు. ఒక నాయకుడి తప్పుగా చిత్రించి తమ ముఠా తగవులు తీర్చుకుంటారు. ఒక పార్టీ తప్పుగా చిత్రించి అధికార సోపానమెక్కేందుకు వినియోగించుకుంటారు. ఒక చట్టం చేస్తే ఇదంతా సరిచేయవచ్చునంటూ ప్రజలను - ముఖ్యంగా మధ్యతరగతి, మేధావి వర్గాలను-భ్రమలలో ముంచెత్తుతారు. మరో కోణంలో అవినీతి మూలాలపై సంఘటితంగా పోరాడకుండా అడ్డుపడతారు.

ఈ అవినీతి అక్రమార్జనలు కార్మిక కుటుంబాలన్నింటినీ, రైతాంగం, గ్రామీణ పేదలనందరినీ, వృత్తిజీవులనూ, కొద్దిపాటి ఆదాయం కోసం చిన్న స్వయం ఉపాధినేర్పరచుకున్న వారినీ, స్థిరమైన నెలసరి ఆదాయ ముందనుకుంటున్న మధ్యతరగతి ప్రజల భద్ర జీవన ఆశలనూ పట్టిపల్లార్చుతున్నది. పైకి కనబడకుండా శరీరమంతా వ్యాపించే క్యాన్సరు వ్యాధిలా శ్రమజీవులందరినీ, సమాజమంతటినీ తినివేస్తున్నది.

వర్గదోపిడీ పునాదిగా ఏర్పడిన ఈ వ్యవస్థకు అవినీతి గోడలుగా నిలుస్తున్నది. ఈ అవినీతి పదఘట్టనలో నలిగిపోతున్నవారు శ్రామికవర్గాలే. లబ్ధి పొందుతున్నది సామ్రాజ్యవాదులూ, దోపిడీ పాలకవర్గాలూ, పాలకనేతలూ, ఉన్నతాధికారులూ. అవినీతి ఈ దోపిడీవ్యవస్థ లక్షణాలలో ఒకటి. దానిఅనేక రూపాలలోఒకటి.

కనుకనే ఈ దోపిడీ వ్యవస్థ యొక్క, పాలకవర్గాల యొక్క, పాలకుల యొక్క, ఉన్నతాధికారుల యొక్క అవినీతి చర్యలకు వ్యతిరేకంగా మనమంతా గొంతువిప్పుదాం! అవినీతితో కుళ్ళికంపుగొడుతూన్న, శ్రమదోపిడీపై ఆధారపడిన ఈ వ్యవస్థను సమూలంగా మార్చుకోవటం మినహా మరో పరిష్కారమార్గం లేదని చాటి చెప్పుదాం! ప్రజాతంత్ర వ్యవస్థ కొరకు; దోపిడీ, అవినీతిలేని వ్యవస్థ కొరకు కార్మికులూ, రైతుకూలీలూ, సమస్త శ్రామిక ప్రజానీకం; ప్రజాతంత్రవాదులు, మేధావులందరూ సమైక్య పోరాటం సాగిద్దాం.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)
ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య

25-8-11

D

# అవినీతికీ, ప్రజాధనం లూటీకీ వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నిర్మించండి!

**అన్నాహజారే,** అతని సహచరులను ప్రభుత్వం అరెస్టు చేయటాన్ని సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇది-ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక వైఖరిని బయటపెట్టింది. మరోవైపున తన వైఖరిపై వస్తున్న విమర్శలూ, వ్యతిరేకతపట్ల దాని భయాన్ని కూడా బయటపెట్టింది. మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వం అంతులేని అవినీతిలో కూరుకుపోయిందని పూర్తిగా స్పష్టమైపోయింది.

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నినాదాలతో గత 20 ఏళ్లుగా కేంద్రంలోని, రాష్ట్రాలలోని ప్రభుత్వాలు అనుసరించిన విధానాల ఫలితంగా భారత శ్రమజీవులు సృష్టించిన సంపదను విదేశీ కంపెనీలు, భారత బడా బూర్జువాలూ, పాలకవర్గ పార్టీల నాయకులూ, నిరంకుశాధికారులూ, వారి ఏజంట్లయిన నీరారాడియా, పత్రికాధిపతులలో కొందరూ దోపిడీ చేసుకుంటున్నారు. ఇది లక్షల కోట్ల రూపాయలకు చేరిందని కాగ్ వెల్లడించింది. మంత్రులు, రాజకీయనాయకులు, ఉన్నతాధికారులూ, అనేక పెద్ద కంపెనీల అధిపతులూ ప్రజాధనం లూటీచేసిన నేరంపై అరెస్టు అయ్యారు.

ఈ పరిస్థితిలో అవినీతికి వ్యతిరేకంగానూ, బలమైన లోక్‌పాల్ బిల్లుకోసమూ అన్నాహజారే శాంతియుత నిరసనను ప్రారంభించాడు. అయితే యిది సమస్యను మౌలికంగా పరిష్కరించలేదు. అవినీతి కుంభకోణాలు సాగుతూనే వుంటాయి. అవి వ్యవస్థలో భాగమయ్యాయి. కనుక అవినీతికీ, కుంభకోణాలకూ, అణచివేతకూ వ్యతిరేకంగా పోరాటం కొనసాగాలి. ప్రస్తుత ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థను కూలద్రోస్తేతప్ప అవినీతి అంతంకాదు.

కనుక సామ్రాజ్యవాదులూ, వారి కంపెనీలు, వాటి ఏజంట్లు సాగిస్తున్న దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా ఆందోళన చేయమనీ, బలీయమైన ప్రజాఉద్యమాన్ని నిర్మించమనీ ప్రజలకు పిలుపు నిస్తున్నాము.

అరవిందసిన్హా
కేంద్రకమిటీ, సిపిఐ(ఎం.ఎల్)

16-8-2011

# కామ్రేడ్ మల్లారెడ్డికి జోహార్లు



**కామ్రేడ్** కుంబాల మల్లారెడ్డి దీర్ఘకాలంగా కాన్సర్ వ్యాధితో పోరాడుతూ తన 58వ ఏట 23-8-2011న మరణించారు.

కామ్రేడ్ మల్లారెడ్డి విద్యార్థి దశనుండీ అభ్యుదయ భావాలు స్వీకరించాడు. కరీంనగర్‌జిల్లా యల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో వ్యవసాయం సాగిస్తూ ఆదర్శరైతుగా, గ్రామసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనాడు. నాడు ముందుకు వచ్చిన సిరిసిల్ల రైతాంగ ఉద్యమంతో మమేకమై నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. పెరిగిన ఉద్యమ అవసరాల నేపథ్యంలో పార్టీ నాయకుడిగా ఎన్నో బాధ్యతలను నిబద్ధతతో సృజనాత్మకంగా నిర్వహించాడు. 1992 జనశక్తి ఏర్పాటుక్రమంలో చురుకైన పాత్రవహించాడు. సిపిఐ (ఎం-ఎల్) జనశక్తిలో వచ్చిన చీలికలపట్ల ఆవేదన చెందాడు. వివిధ రకాల బాధ్యతలు నిర్వహిస్తూనే హైద్రాబాద్‌లోని ఒక కాలనీని, ఆ కాలనీలోని భూములను కబ్జాదారులనుండి ప్రజలు కాపాడుకొనేలా మార్గదర్శకత్వం వహించాడు. కాలనీ అభివృద్ధి కోసం కృషిచేసాడు. 2004 నుండి క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతూనే చెరగని చిరునవ్వుతో ఆత్మవిశ్వాసంతో మృత్యువుతో గత 7 సం॥లుగా పోరాటం చేసాడు. చివరకు 23-8-2011న అంతిమశ్వాస విడిచాడు.

నిశ్శబ్దంగా, నిబద్ధతతో ఏప్రచార పటాటోపాలకు గురికాకుండా సృజనాత్మకంగా అప్పగించిన ప్రతి బాధ్యతను నిర్వర్తించడంపైనే కేంద్రీకరించి కామ్రేడ్ మల్లారెడ్డి కృషి సాగించాడు. కామ్రేడ్ మల్లారెడ్డికి జోహార్లు అర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్రకమిటి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

# ప్రజానాయకుడు కా॥ పీతా వెంకటేశ్వర్లు వర్ధంతి సభ

**నిజాంపట్నం, 25-8-11:**

**రేపల్లె** ఏరియా పీడిత ప్రజానాయకుడు, సిపిఐ (ఎం.ఎల్) కామ్రేడ్ పీతా వెంకటేశ్వర్లు రెండవ వర్ధంతి సభ స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జరిగింది. సభకు ముందుగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు గ్రామంలో ప్రదర్శనచేసి కా॥ వెంకటేశ్వర్లుకి నివాళులర్పించారు.

వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥ ఎం.శోభారాణి మాట్లాడుతూ నిజాంపట్నం ఏరియాలో పేదల, మత్స్యకారుల సమస్యలపై ఆయన నిర్వహించిన ఆందోళనోద్యమాలను వివరిస్తూ నివాళులర్పించారు.

సిపిఐ(ఎం.ఎల్) గుంటూరుజిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు తన ఉపన్యాసంలో, రేపల్లె ఏరియాలో పేదప్రజల ఉద్యమాలకు నాయకత్వం వహించటమే కాకుండా, అలాంటి ఉద్యమాలు నిర్వహించి, నిర్బంధానికి గురైన వారికి ఎంతో సహకారాన్ని కా॥వెంకటేశ్వర్లు అందించారని చెప్పారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) గుంటూరుజిల్లా అధ్యక్షులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రేపల్లె ఏరియా సిపిఐ(ఎం.ఎల్) నాయకుడిగా, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకునిగా పేదప్రజల ఉద్యమాల్లో కా॥వెంకటేశ్వర్లు నిర్వహించిన పాత్రను వివరించారు. బోటుకళాసీల, బోటు యజమానుల అసోసియేషన్ సంఘాలకు అధ్యక్షులుగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేసి సాధించిన విజయాలను పేర్కొన్నారు. గ్రామ పెత్తందార్లకు, రౌడీలకు, దోపిడీదారులకు వ్యతిరేకంగా ఆయన ఎంతో ధైర్యంతో నిలిచారన్నారు. ఈనాడు గుంటూరుజిల్లాలో సాగుతున్న దేవాలయ భూముల, కౌలుదార్ల ఆందోళనల గురించి వివరించారు. టౌన్‌షిప్‌లు, సెజ్‌ల పేరుతో మంగళగిరి మండలంలో రైతుల భూములను బలవంతంగా తీసుకొనే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనా క్రమాన్ని వివరించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కా॥బొల్లిముంత సాంబశివరావు మాట్లాడుతూ రేపల్లె, నిజాంపట్నం ఏరియాల్లో కా॥వెంకటేశ్వర్లుతో కలిసి నిర్వహించిన కార్యక్రమాలను గుర్తుచేసుకొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితిని ప్రస్తావిస్తూ అవినీతిని రూపుమాప టానికి జనలోక్‌పాల్ బిల్లు తేవాలని అన్నా హజారే నిరాహారదీక్ష చేస్తుంటే మరోవైపున ఆదివాసీలు, గ్రామీణ పేదలు, వ్యవసాయకూలీలు, కార్మికులు, నిరుద్యోగులు, తమ మనుగడకోసం ఆందోళనలు

(తరువాయి 7వ పేజీలో)

# పది ప్రధాన సంబంధాలు

కా॥ మావో సే టుంగ్

ఏప్రిల్ 25, 1956

*కా॥ మావో వర్ధంతి సందర్భంగా 'పది ప్రధాన సంబంధాలు' అన్న కామ్రేడ్ మావో వ్యాసం నుండి కొన్ని భాగాల్ని అందిస్తున్నాను. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకొని, సోషలిస్టు నిర్మాణానికి ముందడుగు వేస్తున్న చైనా సమాజంలో ఎదురౌతున్న అభివృద్ధి సమస్యలను ఆయన ఈ వ్యాసంలో చర్చించారు. పారిశ్రామికీకరణ త్వరితంగా సాగి ప్రజాజీవనం అభివృద్ధి చెందటానికి ఏమార్గమనుసరించాలో చర్చించారు. భారీ పరిశ్రమలపై వక్కాణింపు వుంటూనే చిన్న పరిశ్రమలు, వ్యవసాయరంగాలను సమన్వయంతో అభివృద్ధి పరచాల్సిన అవసరాన్ని తెలిపారు. ఈ విధానం ఫలితంగా చైనా అన్ని రంగాల్లోనూ అభివద్ధి సాధించింది.*

*కాగా ఈ విధానానికి భిన్నంగా వ్యవసాయం నుండి మిగులును భారీ పరిశ్రమలకు తరలించి వ్యవసాయ రంగాన్ని కునారిల్ల చేసిన భారత పాలకుల విధానం భారత దేశ ప్రగతిని కుంటుపరిచిన అనుభవంకూడా మనముందుంది. ఈ నాటికీ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నందున వ్యవసాయ రంగం ప్రగతి కుంటుపడటమేకాక భారత ప్రగతి కూడా కుంటు పడింది. ఈ విధాన రూపకర్త అమెరికా కనుసన్నల్లో రూపొందిన బొంబాయి ప్లానే.*

*కా॥ మావో నిర్దేశించిన ఈ విధానాన్ని విడనాడిన అనుభవం కూడా ఈనాడు మన ముందుంది. త్వరితగతి పారిశ్రామికీకరణ పేరిట డెంగ్ రివిజినిస్టు ముఠా వ్యవసాయాన్ని నిరాదరించి, భారీ పరిశ్రమలకే పెట్టుబడి మదుపు తరలించటంతో నేడు చైనాలో రైతాంగం పేదరికంలో కూరుకు పోయారు. పారిశ్రామిక వుత్పత్తులను చైనా ప్రజలకు లేకుండా ఎగుమతి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చైనా నాయకత్వం పెట్టుబడిదారీ పంథా చేపట్టిన ఫలితంగానే ఈ అభివృద్ధి వ్యూహాన్ని చేపట్టిందన్నది నిర్వివాదం.*

*నేడు భూ సేకరణ సమస్యలో సాగుతున్న చర్చకూడా వ్యవసాయానికి-పరిశ్రమలకు మధ్య వైరుధ్యాన్ని సక్రమంగా పరిష్కరించేదిగా కాకుండా, వాటి మధ్య కృత్రిమ పోటీ పెట్టి ఏదోఒకటి ఎంచుకోవాలన్న దిశగా సాగుతున్న సందర్భంలో కా॥ మావో చూపిన పరిష్కారం విలువకలిగివుంది.* *- సంపాదకుడు*



**ఇటీవలి** నెలలో కేంద్రకమిటీ, పొలిటికల్ బ్యూరో, కేంద్ర అధికారుల క్రిందవున్న ముప్ఫయినాలుగు, పారిశ్రామిక, వ్యవసాయక, రవాణా, వాణిజ్య, ద్రవ్య తదితర డిపార్టుమెంటుల పనిని గురించి నివేదికలను విన్నది. సోషలిస్టు నిర్మాణం, సోషలిస్టు పరివర్తనలకు సంబధించిన అనేక సమస్యలను ఆ రిపోర్టుల నుండి గుర్తించింది. మొత్తంమీద, అవి పది సమస్యలుగా లేదా పది ప్రధాన సంబంధాలుగా తేలాయి.

ఒక మౌలిక విధానంపైన దృష్టిని కేంద్రీకరించ డానికే ఈ పది సమస్యలు లేవనెత్తబడుతున్నాయి. సోషలిజం ఆశయానికి సేవచేసేటందుకు గాను, అనుకూలమైన అన్ని అంతర్గత, బహిర అంశాలను సమీకరించడమనే మౌలిక విధానంపైన దృష్టిని కేంద్రీకరించడానికే ఈ పది సమస్యలు లేవనెత్తబడ్డాయి. సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానాల ఏలుబడికి స్వస్తి చెప్పటానికీ, ప్రజాస్వామిక విప్లవంకోసం విజయాన్ని సాధించడానికి గానూ, ఇపుడు మనం అదేవిధానాన్ని అనుసరిస్తున్నాం. అయినా గానీ మన పనిలో చర్చించాల్సిన కొన్ని సమస్యలు వున్నాయి. సోవియట్ యూనియన్‌లో, సోషలిజాన్ని నిర్మించే క్రమంలో జరిగిన కొన్ని లోపాలు, తప్పులు ఇటీవలనే వెలుగులోకి వచ్చాయి అన్న వాస్తవం ప్రత్యేకించి గమనించదగ్గది. వారు అనుసరించిన చంక్రమణాలనే మీరూ అనుసరించాలనుకుంటున్నారా? వారి అనుభవం నుండి గుణపాఠాలను తీసుకోవడం ద్వారానే మనం గతంలో కొన్ని చంక్రమణాల నుండి తప్పించుకొన్నాం. ఇపుడు అలాగే చేస్తేనే మరింత సబబుగా వుంటుంది.

అంతర్గతంగానూ, బహిరంగంగానూ అనుకూలమైన అంశాలు ఏవి? అంతర్గతంగా, కార్మికులు మరియు కర్షకులే మూలశక్తి. మనవైపు తిప్పుకోగలశక్తులే మధ్యస్థ శక్తులు. అభివృద్ధి నిరోధక శక్తులు ఒక ప్రతికూలఅంశం. అలా అయినప్పటికీ మనం మన పనిని చక్కగా చేయాలి. ఈ ప్రతికూలఅంశాన్ని సాధ్యమైనంతవరకు అనుకూల అంశంగా మార్చుకోవాలి. అంతర్జాతీయంగా, ఐక్యపర్చ బడగలిగిన శక్తులన్నీ తప్పనిసరిగా ఐక్యపర్చబడాలి, తటస్థంకాని శక్తులు, మన ప్రయత్నాల ద్వారా తటస్థం చేయబడగలవు. అభివృద్ధి నిరోధక శక్తులను కూడా విచ్ఛిన్నం చేసి వాడుకోవచ్చు. క్లుప్తంగా, ప్రత్యక్షమైనవిగానీ, పరోక్షమైనవిగానీ సకల శక్తులను మనం సమీకరించాలి. చైనాను ఒక శక్తివంతమైన సోషలిస్టు దేశంగా తయారు చేయడానికి కృషిచేయాలి.

నేను, ఇపుడు పది సమస్యలను చర్చిస్తాను.

## భారీ పరిశ్రమలు ఒక వైపునా, వ్యవసాయం, లఘుపరిశ్రమలు మరోవైపున-వీటి మధ్య సంబంధం

మన దేశ నిర్మాణ కృషిలో వక్కాణింపు భారీ పరిశ్రమలమీదే వుంది. ఉత్పత్తి సాధనాల ఉత్పత్తికి తప్పనిసరిగా ప్రాధాన్యతలు ఇవ్వాలి. దానికి తిరుగులేదు. కానీ, జీవనాధార సాధనాల ఉత్పత్తిని మరీ ముఖ్యంగా ధాన్యోత్పత్తిని నిర్లక్ష్యం చేయువచ్చునని ఖచ్చితంగా అనుకోరాదు. ఆహారము, తదితర నిత్యావసరాలు తగినంత లేకపోతే, కార్మికుల సంక్షేమాన్ని చూడడం అసాధ్యమవుతుంది. ఇక అపుడు భారీపరిశ్రమలను అభివృద్ధి చేయటం గురించి మాట్లాడటానికి అర్ధమేమైనా ఉంటుందా? అందువల్ల ఒకపక్క భారీ పరిశ్రమ, మరోప్రక్క లఘు పరిశ్రమ వ్యవసాయాలకు మధ్య సంబంధాల్లో తప్పనిసరిగా సముచిత రీతిలో వ్యవహరించాలి.

ఈ సంబంధంతో వ్యవహరించడంలో, సూత్ర పరమైన తప్పులను మనం చేయలేదు. సోవియట్ యూనియన్ కంటే, కొన్ని తూర్పు యూరప్ దేశాలకంటే మిన్నగానే మనం వ్యవహరించాం. ధాన్యోత్పత్తిలో, అక్టోబరు విప్లవపు ముందు కాలంనాటి అత్యున్నత స్థాయిని చేరుకోవడంలో సోవియట్ యూనియన్ యొక్క దీర్ఘకాలిక వైఫల్యమూ, కొన్ని తూర్పు యూరపు దేశాలలో భారీ పరిశ్రమల అభివృద్ధికి, లఘు పరిశ్రమల అభివృద్ధికి మధ్య కొట్టొచ్చినట్లు కనబడే అసమతుల్యం నుండి పుట్టుకొచ్చిన తీవ్రసమస్యలు-ఇటువంటి సమస్యలు మన దేశంలో ఉనికిలోలేవు. వ్యవసాయాన్ని, లఘుపరిశ్రమలను అశ్రద్ధచేస్తూ భారీ పరిశ్రమపై వారి తలకిందులు వక్కాణింపు, మార్కెట్లో వస్తువుల కొరతకు, ద్రవ్య చలామణి అస్థిరతకు దారి తీస్తుంది. మరోప్రక్క మనమేమో వ్యవసాయానికి, లఘుపరిశ్రమలకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నాం. మనమింత కాలమూ వ్యవసాయాన్నే పట్టించుకొన్నాం, అభివృద్ధి చేశాం, పరిశ్రమాభివృద్ధికి అవసరమైన ధాన్యం, ముడిపదార్ధాల సరఫరాను గమనించదగ్గ మేరకు ఖరారు చేసుకొన్నాం. మన నిత్యావసర వస్తువులు బాగానే సరఫరా అవుతున్నాయి. మన ధరలు, చలామణి ద్రవ్యం స్థిరంగా వున్నాయి.

వ్యవసాయం, లఘుపరిశ్రమలలో మరింత ఎక్కువ అభివృద్ధిని సాధించడానికిగాను, ఒకప్రక్క భారీపరిశ్రమలో పెట్టుబడికి, మరోప్రక్క వ్యవసాయం లఘుపరిశ్రమలలో పెట్టుబడికి మధ్యపాళ్ళను సవ్యమైనరీతిలో సరిచేసు కోడాన్ని కొనసాగించడం అన్నదే మనమిపుడు ఎదుర్కొంటున్న సమస్య. భారీ పరిశ్రమ ఇంకెంతమాత్రం ప్రాథమికమైనది కాదని దీని అర్థమా? కాదు, ఇప్పటికీ అదే ప్రాథమికమైనది. మన పెట్టుబడులలో వక్కాణింపు ఇప్పటికీ దానిమీదనే వుంది. కానీ, వ్యవసాయం, లఘు పరిశ్రమల పాలు కొంతమేరకు పెంచబడి తీరాలి.

ఈ పెంపు ఏ ఫలితాలనిస్తుంది? మొదటిది, ప్రజల నిత్యావసరాలు, మరింత బాగా తీర్చబడగలవు. రెండవది, పెట్టుబడి సంచయనం మరింత త్వరితం చేయబడగలదు. ఆ విధంగా మనం భారీపరిశ్రమలను మరింత మేలైన మరిన్ని ఎక్కువ ఫలితాలతో అభివృద్ధి చేయగలం. భారీపరిశ్రమ కూడా పెట్టుబడిని సంచయనం చేసుకోగలదు, అయితే మనకు ప్రస్తుతమున్న పరిస్థితులలో, లఘుపరిశ్రమలు, వ్యవసాయమూ, మరింత ఎక్కువగానూ, మరింత త్వరితంగానూ పెట్టుబడిని సంచయనం చేయగలవు.

ఇక్కడ, ఈ ప్రశ్న ఉత్పన్నమవుతుంది: భారీ పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే మీ వాంఛ సిసలైనదా లేక బూటకమా? బలమైనదా లేక బలహీనమైనదా? మీ వాంఛ, బూటకమైనదిగానీ బలహీనమైనదిగానీ అయితే, అపుడుమీరు వ్యవసాయాన్ని లఘు పరిశ్రమలను దెబ్బతీస్తారు, వాటిలో తక్కువగా పెట్టుబడి పెడతారు. మీ వాంఛ సిసలైనదిగానీ, బలమైనదిగానీ అయితే, అపుడు లఘుపరిశ్రమలకు మరింత ఎక్కువ ధాన్యము, మరిన్ని ముడిపదార్ధాలు వుండి, పెట్టుబడి మరింతగా పోగుపడ గలందులకుగానూ, మీరు వ్యవసాయం, లఘుపరిశ్రమ లకు ప్రాధాన్యతనిస్తారు. ఇక అపుడు, భవిష్యత్తులో భారీ పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి, మరిన్ని నిధులుంటాయి.

భారీ పరిశ్రమలను మనం అభివృద్ధిచేయడానికి ఇపుడు రెండు వైఖరులు తీసుకోడానికి సాధ్యమవుతుంది: ఒకటేమో, వ్యవసాయం, లఘుపరిశ్రమలను తక్కువగా అభివృద్ధిచేయడం, మరొకటేమో, వాటిని మరింతగా అభివృద్ధిచేయడం. దీర్ఘకాలంలో, మొదటి వైఖరి భారీపరిశ్రమల, కొద్దిపాటి మరియు నెమ్మదైన అభివృద్ధికి దారితీస్తుంది. లేదా కనీసం, తక్కువ దృఢత్వం కలిగిన పునాదిపై దాన్ని నిలబెడుతుంది. ఇప్పటినుండి కొన్ని దశాబ్దాల తర్వాత, మొత్తంమీద లెక్కలు చూసుకొన్నప్పుడు, అది లాభదాయకమైనదిగా ఋజువుచేసుకోలేదు; రెండవ వైఖరి భారీపరిశ్రమయొక్క మరింత పెద్ద, మరింత త్వరితమైన అభివృద్ధికి దారితీస్తుంది. అది ప్రజల బ్రతుకు తెరువును ఖరారు చేస్తుంది కనక, భారీపరిశ్రమాభివృద్ధికి మరింత దృఢమైన పునాదిని వేస్తుంది.

## కోస్తా ప్రాంతంలోని పరిశ్రమలకు, లోతట్టు ప్రాంతంలోని పరిశ్రమలకు మధ్య సంబంధం

గతంలో మన పరిశ్రమలు కోస్తా ప్రాంతాల్లోనే కేంద్రీకరించబడ్డాయి. కోస్తా ప్రాంతాలంటే లియవోనింగ్, హోపి, పెకింగ్, టీన్‌ట్సిన్, తూర్పు హోనాన్, షాంటుంగ్, అన్‌హ్వా, కియాంగ్సు, షాంఘై, చెకియాంగ్, ఫూకిన్, క్వాంగ్‌టుంగ్, క్వాంగ్సీ రాష్ట్రాలు. మన లఘుపరిశ్రమలు, భారీపరిశ్రమలు, రెంటిలోని 70శాతం దాకా కోస్తా ప్రాంతాల్లోనే కనబడతాయి. కేవలం 30 శాతానివి మాత్రమే లోతట్టు ప్రాంతంలో కనపడతాయి. ఈ అసమంజస పరిస్థితి చరిత్రయొక్క ఒక ఉత్పత్తే. కోస్తా ప్రాంతపు పారిశ్రామిక పునాది తప్పకుండా సంపూర్ణంగా వినియోగపెట్టుకోబడాలి, కానీ పరిశ్రమలు అభివృద్ధిచెందుతున్న క్రమంలోనే వాటిని సరిసమానంగా పంచడానికిగానూ లోతట్టు ప్రాంతంలో పరిశ్రమలను పెంపొందింపజేయడానికి మనం కృషిచేయాలి. ఈ రెంటికి మధ్య సంబంధం విషయంలో మనం పెద్ద పొరపాట్లను చేయలేదు. అయితే, ఇటీవలి సంవత్సరాలలో మనం కోస్తా పరిశ్రమలను తక్కువగా అంచనా కట్టాం. వాటి అభివృద్ధికి సరిపడేంత ఎక్కువ శ్రద్ధను పెట్టలేదు. ఇది మారితీరాలి.

కొద్దికాలం కిందట కొరియాలో అప్పటికింకా పోరాటం వుండింది, అంతర్జాతీయ పరిస్థితి బాగా ఉద్రిక్తంగా వుండింది; కోస్తా ప్రాంత పరిశ్రమల యెడల మన వైఖరిపై ఇది ప్రభావం చూపనేచూపుతుంది. ఇపుడు, చైనాకు వ్యతిరేకంగా కొత్త దురాక్రమణ యుద్ధంగానీ లేదా సమీప భవిష్యత్తులో మరో ప్రపంచయుద్ధంగానీ వుండే అవకాశంలేదు. ఒక దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువకాలంపాటు బహుశా, ఒక శాంతికాలం వుండవచ్చు. అందువల్ల, కోస్తాప్రాంత పరిశ్రమల కర్మాగార ఉత్పత్తి సామర్ధ్యాన్ని, సాంకేతిక బలగాలను సంపూర్ణంగా వుపయోగపెట్టుకోవడంలో గనక మనం విఫలమైతే, అది తప్పు అవుతుంది. మనకు పది సంవత్సరాలుగాక, అయిదు సంవత్సరాలే దక్కినాగానీ, కోస్తా ప్రాంతంలో పరిశ్రమలను అభివృద్ధిపర్చడానికి నాలుగు సంవత్సరాలు మనం కష్టపడి పనిచేయాలి, అయిదవ సంవత్సరంలో యుద్ధం మొదలవగానే వాటిని ఖాళీచేయాలి. మన దగ్గరవున్న సమాచారాన్నిబట్టి, లఘుపరిశ్రమలలో, ఒక కర్మాగారం నిర్మాణమూ, దాని పెట్టుబడియొక్క సంచయనమూ చాలా వేగంగా జరుగుతుంది. యావత్తు కర్మాగారం ఉత్పత్తిని ప్రారంభించిన తర్వాత, అది నాలుగు సంవత్సరాలలో, తన మూలధనాన్ని సంపాయించుకోవడమేకాక, మూడు లేదా రెండు కొత్త కర్మాగాలనుగానీ, లేదా ఒక కొత్త కర్మాగారాన్నిగానీ లేదా కనీసం ఒక కర్మాగారంలో భాగాన్నిగానీ నిర్మించేందుకు సరిపడేంత సంపాదించగలదు. ఇలాంటి లాభదాయకమైన పనులను మనమెందుకు చేపట్టకూడదు? అణుబాంబు ఇప్పటికీ నెత్తిమీదనే వుంది, ఏ క్షణాన్నయినా మనమీద పడబోతోంది అనే అభిప్రాయం వాస్తవంతో పొసగని అంచనా, దీన్ని దృష్టిలోపెట్టుకొని కోస్తాప్రాంత పరిశ్రమలపట్ల ప్రతికూల వైఖరిని అవలంబించడమన్నది కూడా తప్పే అవుతుంది.

అన్ని కొత్త ఫ్యాక్టరీలు కోస్తాప్రాంతాలలోనే నిర్మింపబడాలని దీన్నుండి అర్థం తీయరాదు. నిస్సందేహంగా, పరిశ్రమలు క్రమక్రమంగా సరిసమానంగా వ్యాప్తిచెంద డానికిగానూ, కొత్త పరిశ్రమలలోని అతి ఎక్కువభాగం లోతట్టు ప్రాంతాలలోనే ఏర్పాటు చేయబడాలి; మీదుమిక్కిలి, మన యుద్ధ వ్యతిరేక సన్నాహాలకు ఇది తోడ్పడుతుంది. కానీ కొన్ని కొత్త కర్మాగారాలు మరియు గనులు, వాటిలో కొన్ని పెద్దవికూడా, కోస్తా ప్రాంతాలలో నిర్మింపబడవచ్చు. కోస్తాప్రాంతాలలో ఇప్పటికే వున్న లఘు మరియు భారీపరిశ్రమలయొక్క విస్తరణ. పునర్‌నిర్మాణాల విషయానికివస్తే, గతంలో మనంగణనీయమైన స్థాయిలోనే పనిని చేశాం, భవిష్యత్తులో ఇంకా చాలా ఎక్కువ చేస్తాం.

కోస్తా ప్రాంతాలలోని పాతపరిశ్రమలను, సజావుగా వినియోగపెట్టుకోవడమూ వాటి ఉత్పత్తి సామార్ధ్యాలను అభివృద్ధి చేయడమూ అన్నది లోతట్టు ప్రాంతాలలోని పరిశ్రమలను పెంపొదింపచేసి, వాటికి మద్దతునివ్వడంలో, మనల్ని మరింత బలమైన స్థానంలో వుంచుతుంది. వ్యతిరేఖ వైఖరిని అవలింబిస్తే, అది ఈ రెండవవాటి సత్వరాభివృద్ధిని కుంటుపర్చటానికే తోడ్పడుతుంది. కనక, ఇది కూడా అదే విధంగా, లోతట్టు ప్రాంతంలోని పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే కోరిక సిసలైనదా, కాదా అన్న సమస్యే. అది సిసలైనదే అయి, బూటకమైనది కాకపోతే, కోస్తాప్రాంతాల్లోని పరిశ్రమలను ముఖ్యంగా లఘు పరిశ్రమలను మరింత క్రియాశీలంగా వినియోగించుకోవాలి, పెంపొందింపజేయాలి.

## పారిశ్రామికీకరణ వైపు చైనా మార్గం

మన పారిశ్రామికీకరణ బాటను గురించి చర్చించడంలో, భారీపరిశ్రమలు, లఘుపరిశ్రమలు, వ్యవసాయాల అభివృద్ధికి మధ్య సంబంధాల్ని మనం యిప్పుడు ప్రధానంగా చర్చిస్తాము. భారీపరిశ్రమలు చైనా ఆర్థిక నిర్మాణపు గుండెకాయ అని తప్పక నొక్కి చెప్పబడాలి. అదే సమయంలో లఘుపరిశ్రమలు, వ్యవసాయాల అభివృద్ధిపట్ల తప్పనిసరిగా పూర్తి శ్రద్ధపెట్టబడాలి.

చైనా, 80 శాతం జనాభా గ్రామీణ ప్రాంతంలో నున్న ఒక పెద్ద వ్యవసాయ దేశం కాబట్టి వ్యవసాయం, పరిశ్రమతోపాటుగానే తప్పక అభివృద్ధి చెందాలి. ఎందుకంటే పరిశ్రమలు ఆ విధంగా మాత్రమే ముడిసరుకులను, మార్కెట్‌ను పొందగలవు. శక్తివంతమైన భారీపరిశ్రమలు నిర్మించడానికి మరిన్ని నిధులను సంచయనం చేసుకోవడం ఆ విధంగా మాత్రమే సాధ్యంకాగలదు. లఘుపరిశ్రమ, వ్యవసాయంతో చాలా సన్నిహితంగా ముడిపడివుందని అందరికీ తెలుసు. వ్యవసాయం లేకుండా లఘుపరిశ్రమలుండవు. వ్యవసాయం భారీపరిశ్రమకు ఒక ముఖ్యమైన మార్కెట్‌ను సమకూర్చి పెడుతుందని ఇప్పటికి అంత స్పష్టంగా అర్ధం చేసుకోబడటం లేదు. అయితే, వ్యవసాయపు సాంకేతిక రూపాంతరీకరణ, సాంకేతిక ఆధునికీకరణల్లో క్రమానుగత పురోగతి, యంత్రాలు, ఎరువులు, నీటి నిలువ, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు, పొలాలకు రవాణా సౌకర్యాలు, చమురు మరియు గ్రామీణ వినియోగదారుల కొరకు నిర్మాణ వస్తువులను మరింతగా కోరినపుడు, యీ వాస్తవం మరింత త్వరగా అర్ధమవుతుంది. రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికల కాలంలో వ్యవసాయంలో మరింత ఎక్కువ పెరుగుదలను సాధించి, తద్వారా లఘు పరిశ్రమలలో అభివృద్ధిని **(తరువాయి 5వ పేజీలో)**

# బ్రిటన్‌లో దహనకాండ దోపిడీ వ్యవస్థపై అశాంతితో రగులుతున్న యువత ప్రతీకారం

**2011** ఆగస్టు 13 శనివారం మధ్యాహ్నం కొందరు యువకుల నిరసన ప్రదర్శన. రెండురోజులక్రితం ఒక నల్లజాతి యువకుడిని అరెస్టుచేసే క్రమంలో పోలీసులు అతన్ని కాల్చిచంపారు. దీనికి నిరసన తెలుపుతూ యువకులు ప్రదర్శన చేశారు. పోలీసులతో వారికి వాగ్వివాదం, కొద్దిపాటి ఘర్షణ జరిగింది. చీకటి పడేసరికి అల్లర్లు మొదలయ్యాయి. ధనికుల ఆవాసమైన లండను నగర ఉత్తరప్రాంతంలో షాపుల లూటీ, తగులబెట్టటం మొదలైంది. క్రమంగా నగర తూర్పు ప్రాంతానికి విస్తరించింది. ఆదివారం నాటికి ఇంగ్లండులోని ఇతర ప్రాంతాలకు వ్యాప్తిచెందాయి. యువకులు షాపులు లూటీచేశారు. తగులబెట్టారు. పోలీసులతో తలపడ్డారు. పోలీసుకార్లు ధ్వంసం చేశారు. రాత్రి 10 గంటలకు దక్షిణ, పశ్చిమ లండనుకు ఇవి విస్తరించాయి. సోమవారం ఉదయానికి మాంచెస్టర్, బర్మింగ్‌హమ్ నగరాలకూ, అనేక చిన్నపట్టణాలకూ విస్తరించాయి. సెలవలు రద్దుచేసుకుని పార్లమెంటు సభ్యులు సమావేశమయ్యారు. ప్రధాని కామెరాన్ అల్లర్లు సాగిస్తున్న యువకులను నేరగాళ్లని ముద్రవేశాడు. నల్లజాతి, ఆసియా యువకులే ఈ అల్లర్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతిపక్ష లేబరు పార్టీ నాయకుడు మిలిబాండ్ పోలీసుశాఖకు తగ్గించిన నిధులను పునరుద్ధరించాలని కోరాడు. అల్లర్లకు కారణాలు తెలుసుకునేందుకు విచారణ జరిపించాలని కోరాడు. ప్రభుత్వం దీనికి నిరాకరించింది. రాత్రికి రాత్రే మాజిస్ట్రేటులను నియమించారు. వీరు రాత్రంతా పనిచేసి పోలీసులు అరెస్టుచేసిన వారికి శిక్షలు వేశారు. ఇందులో న్యాయం, చట్టబద్ధత లేదనటానికి సూపర్ మార్కెట్టు నుండి ఒక నీళ్లబాటిలు దొంగలించాడన్న ఆరోపణపై 11ఏళ్ల బాలుడికి ఆరునెలలు ఖైదు శిక్షగా వేయటమే ఉదాహరణ. కోర్టులముందు దోషులుగా నిలబెట్టినవారిలో విద్యార్థులూ, నిరుద్యోగులూ, టీచర్లు, స్కూలు బాలురు ఉన్నారు. దొంగలించిన సరుకుల్లో బ్రాండెడ్ రెడీమేడ్ బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులూ వున్నాయి. వీరిలో తెల్లజాతి నల్లజాతి, ఆసియా దేశాల యువకులు వున్నారు.

ఎందుకీ దహనకాండ చెలరేగింది? ఎందుకింత వేగంగా నగరమంతా వ్యాపించాయి? దీనిగురించి చర్చ సాగుతున్నది. నల్లజాతి యువకుడి చావుతో నిరుద్యోగులై చీకటి వ్యాపారాలలో పాల్గొంటున్న నల్లజాతి యువకులు ఈ దోపిడీలకు పాల్పడ్డారనీ, తర్వాత ఆసియా దేశాల యువకులు కలిశారనీ ప్రచారంచేశారు. దీనినుండి చీకటి వ్యాపారం, మాఫియాలు వాటి తీరుగురించి చర్చచేసి జాతి విద్వేషాలను రగిల్చే ప్రయత్నం జరిగింది.

నల్లజాతి యువకుడి చావు అల్లర్లు ప్రారంభం కావటానికి తక్షణ ప్రేరకంగా వుంది. నల్లజాతి యువకుడి కారణంగానే అల్లర్లు జరిగివుంటే అది నల్లజాతి నివాస ప్రాంతాల్లో ప్రారంభమై వుండాలి. అల్లర్లు జరిగిన ప్రాంతాలకూ వివిధ జాతులు నివసించే ప్రాంతాలకు సంబంధం లేకుండా నగరమంతటా వ్యాపించాయి. వేగంగా ఇతర నగరాలకు వ్యాపించాయి. కనుక బ్రిటన్ సమాజంలోనే లోపమున్నదన్న అంశాన్ని గమనించాలి.

గత మూడు దశాబ్దాలుగా థాచర్ ప్రారంభించిన, బ్లెయిర్, కామెరాన్‌లు కొనసాగిస్తున్న "మరో ప్రత్యామ్నాయం లేదు" అన్న విధానాల ఫలితంగా ఇంగ్లాండులోని నగరాలన్నింటా గతంలో ఎన్నటికన్నా కూడా ధనికులు, పేదలమధ్య వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నది. 16-25 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం 20శాతం వుంది. వారి సంఖ్య 10 లక్షలు. ఆపై వయసువారిలో నిరుద్యోగం 7.8శాతం. వీరి సంఖ్య 25 లక్షలు. ఫలితంగా కుటుంబాల ఆదాయంలో వ్యత్యాసాలు తీవ్రమయ్యాయి.

దీనికితోడు 2008లో అమెరికాలో మొదలైన మాంద్యత 2009లో బ్రిటన్‌ను చేరింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన డెమొక్రాటిక్ పార్టీ స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపును తగ్గించివేసింది. దీనితో స్థానిక సంస్థలు నిరుద్యోగులకు పనిచూపే యువజన సేవలను మూసివేశాయి. యువకులు, కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. 16,17 ఏళ్లున్న పేద విద్యార్థులు చదువుకునేందుకు తోడ్పడుతున్న కొద్దిపాటి విద్యాభృతిని తగ్గించివేసింది. విశ్వవిద్యాలయాల ఫీజులను మూడురెట్లు పెంచింది. ఆరోగ్య-వైద్య సేవలకు నిధులను బాగా తగ్గించివేసింది. కాగా 14 వందలకోట్ల పౌండ్లను (రూ.లక్షకోట్లు దాదాపు) బ్యాంకులకు ధారపోసింది. వినియోగ సరుకుల సంస్కృతిని పెంచటంతో, ఆ సరుకులను పొందలేకపోవటమే తమను సుఖజీవనానికి దూరంచేసిందన్న భావనను నానాటికీ పెరుగుతున్న వర్గ వ్యత్యాసాలు కలిగించాయి. ఇది యువతలో తీవ్ర అశాంతిని కలిగించింది. కనుకనే అల్లర్లలో లూటీ అయింది బ్రాండెడ్ సరుకులమ్మే దుకాణాలు. ఇక ఫోను సంభాషణలను రహస్యంగా రికార్డుచేసి, పార్లమెంటు సభ్యులు ఆహారానికీ, ఫర్నిచరుకు తప్పుడు లెక్కలతో ఖర్చు చూపించి ప్రభుత్వ ధనాన్ని దిగమింగిన విషయాన్ని పత్రికల గుత్తాధిపతి రాబర్టు మర్డోక్ బయటపెట్టడం; అతనిపై చర్య తీసుకోవటానికి భయపడి తాత్సారం చెయ్యటం రాజకీయ వ్యవస్థపై యువకుల విశ్వాసాన్ని కోల్పోయేలా చేసింది. ఇవన్నీ కలిసి నల్లజాతి యువకుడి హత్య ప్రేరణగా అల్లర్లు సాగాయి.

మూడు దశాబ్దాలుగా సాగుతున్న వర్గ వ్యత్యాసాలను పెంచే తమ విధానాలను మార్చుకొనేందుకు సిద్ధపడని బ్రిటిషు పాలకులు, ఈ అల్లర్లను అణచివేయటానికి పూనుకున్నారు. కారణా లేమిటో తెలుసుకునేందుకు విచారణ జరిపేందుకు కూడా నిరాకరించారు. అశాంతితో వున్న యువకులను నేరగాళ్లని ముద్రవేశారు. వలసవచ్చిన ఇతర దేశీయులపైనా, నల్లజాతుల వారిపైనా విద్వేషాలను రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు. ఆ విధంగా ప్రజలలో అశాంతి సంఘటిత శక్తిగా పరిణమించకుండా నివారించేందుకు పూనుకున్నారు.

అయితే బ్రిటన్‌లో పరిస్థితి నిరాశాజనకంగా లేదు. నిర్మాణయుత పోరాటాలు సాగుతున్నాయి. ఫీజుల పెంపుకు వ్యతిరేకంగా విద్యార్థులూ, అధ్యాపకులూ రోడ్లమీదకొచ్చి నిరసన తెలుపుతున్నారు. విద్య, వైద్యం, నిరుద్యోగ భృతివంటి సంక్షేమ చర్యలలో కోతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. పోస్టలు కార్మికులు, రైల్వే కార్మికులు పనినుండి తొలగింపులను ప్రతిఘటిస్తున్నారు. ఇవే అశాంతితో రగులుతున్న యువతను నిర్మాణయుత సంఘటిత శక్తిగా మలుస్తాయి. D

# కార్మికులను బానిసత్వంలోకి దించే నూతన ఉత్పత్తి విధానం

**జాతీయ** ఉత్పత్తి మండలితోను, ప్రణాళికా సంఘంతోను చర్చించిన పిదప పారిశ్రామిక విధాన మరియు ప్రోత్సాహక శాఖ జాతీయ ఉత్పత్తి విధానం అనబడేదాన్ని రూపొందించింది. ఈ విధానాన్ని ప్రధాని ఆమోదించారు. పర్యావరణ, కార్మిక సంక్షేమ అంశాలను దృష్టిలో ఉంచుకొని చర్చల ప్రక్రియను కొనసాగించమని చెప్పారు. ఈ చర్చల ప్రక్రియ జూలై 2011 నాటికి పూర్తవ్వాలని అప్పుడు మాత్రమే కాబినెట్ నూతన విధానాన్ని ఆమోదించి తుది విధాన ప్రకటన చేయగలదని ఆయన చెప్పారు. ఈ నూతన ఉత్పత్తి విధానం పరిశ్రమలకు ఖర్చు తగ్గించడమేకాక కార్మిక చట్టాలను సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. స్థూల జాతీయోత్పత్తిలో తగ్గుతున్న పారిశ్రామిక ఉత్పత్తి వాటాను పెంచి 2025 నాటికి కనీసం 25 శాతానికి పెంచడం, 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించటం, ఈ నూతన విధాన లక్ష్యం.

1991 నుండి కూడా ప్రభుత్వాలు కార్మిక అనుకూల నినాదాలను ఇస్తున్నాయి. కానీ పాలనా విధానాలు మాత్రం కొత్త ఉద్యోగాలను కల్పించే విధంగా ఉండటంలేదు. "సమ్మిళిత అభివృద్ధి", "ఉద్యోగ కల్పన" మొదలైన నినాదాలు దేశప్రజలను ముఖ్యంగా కార్మిక వర్గాన్ని మోసం చేయటానికి ఉద్దేశించినవే.

2008 ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం భారత దేశంలోని శ్రమశక్తిలో 6 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారు. మిగిలిన 94% దిన కూలీలుగా తక్కువ వేతనాలతో, సురక్షితంకాని పనిపరిస్థితులలో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారు. సంఘటిత రంగంలోను, పబ్లిక్‌రంగ సంస్థలలోనూ కార్మికుల సంఖ్య 1995లో ఒక కోటీ 80 లక్షలుండగా, 2008 నాటికి ఒక కోటికి పడిపోయింది. ప్రైవేటు రంగంలో సంఘటిత కార్మికుల సంఖ్య 50 లక్షల వద్దే నిలిచిపోయింది. సరుకుల తయారీ రంగంలో పనిచేసే కార్మికుల సంఖ్య మాత్రం సంఘటిత రంగ కార్మికులలో 18% మాత్రమే ఉంది. అంటే మొత్తం మీద 60 లక్షల మందే సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఉన్నారు.

ఈ గణాంకాలను పరిశీలిస్తే గత కొన్ని దశాబ్దాలుగా పాలకులు అనుసరించిన నయా ఉదారవాద విధానాల కారణంగా, సంఘటితరంగంలోనూ, ఉత్పత్తి రంగంలోనూ కొత్త ఉద్యోగాలు ఏమాత్రం రాలేదని అర్థమవుతున్నది. అంతేగాక ఉద్యోగ కల్పనా స్థితి మరింత దిగజారింది.

"భారతదేశంలోని కార్మిక చట్టాలే అభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు అవరోధంగా ఉన్నాయి" అని నయా ఉదారవాద ఆర్థిక వేత్తలు, నిపుణులు, పాలకులు, పరిశ్రమల యజమానులు వాదిస్తున్నారు. "ఈ కార్మిక చట్టాలు సంఘటితరంగంలోని కొద్ది మందికి మాత్రం ఉద్యోగ భద్రతను కల్పిస్తున్నా"యని వాపోతున్నారు. ఉపాధి కల్పన, ఉత్పత్తిరంగమూ వృద్ధిచెందాలంటే ఈ కార్మిక చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండు చేస్తున్నారు. ఈ చట్టాలే అభివృద్ధికి, పారిశ్రామిక అభివృద్ధికి, ఉద్యోగ కల్పనకు అడ్డుగా ఉన్నాయని మాటవరసకు మనం అంగీకరిస్తే, ఈ చట్టాలను ఎందుకు తొలగించరు? వీటిని అసంఘటిత రంగానికి ఎందుకు వర్తింపజేలేదు. అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికుల మధ్య వివక్ష లేకపోతే ఒకే రకమయిన విధానాలు ఉండేవి. ఈ సమస్యను పరిష్కరించటానికి చర్యలు చేపట్టక పోగా, ఈ స్వార్థపరశక్తులు కార్మిక చట్టాలను తొలగించాలనుకుంటున్నారు. "పరిమిత కార్మిక చట్టాల"ను సులభతరం చేయాలని వాదించటం, దుర్మార్గమైన అమానవీయ శ్రమదోపిడీని చట్టబద్ధం చేసి బడా పెట్టుబడికి కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చటమే.

ఇప్పటికే ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, ఎగుమతి ప్రోత్సాహక మండళ్ళు పనిచేస్తున్నాయి. ఈ జోన్‌లు వేటిలోనూ ఉద్యోగ భద్రతలేదు, కార్మిక సంక్షేమ చర్యలకు ఎటువంటి రక్షణాలేదు. ఈ ప్రత్యేక మండళ్ళలో కార్మిక సంఘాలు సమస్యలపై ప్రాతినిధ్యం చేయటానికిగాని, చర్చించడానికిగాని అనుమతి లేదు. విశాఖపట్నం ఎగుమతి ప్రోత్సాహక మండలిలో కార్మిక సంఘ ప్రతినిధి వర్గాన్ని తమ డిమాండ్లు సమర్పించుటకు కూడా అనుమతించక పోగా అరెస్టు చేశారు. ఈ ప్రత్యేక మండళ్ళలోని కార్మికులను 10 నుండి 12 గంటలపాటు బలవంతంగా పనిచేయిస్తున్నారు.

ఈ "నూతన ఉత్పత్తి విధానం"తో అనేక ఉత్పత్తి మదుపు మండళ్ళు ఏర్పాటు కానున్నాయి. కార్మిక చట్టాలను మరింత సరళతరం చేసే విధంగా వాటికి అధికారాలుంటాయి.

ఉత్పత్తి మదుపు మండళ్ళలో పరిశ్రమలను మూసివేయటం మరింత తేలికవుతుంది. పారిశ్రామిక వివాదాల చట్టంతో సంబంధంలేకుండా, ఎటువంటి అడ్డంకులూ లేకుండా మూసివేస్తారు. కార్మికుల సమస్యలు సమయానికి పరిష్కారమవుతాయని కార్మికులను బుజ్జగిస్తారు. ప్రతి ఉత్పత్తి మండలికి ఉన్న నిధిని ప్రత్యేక ప్రయోజన వాహనం నిర్వహిస్తుందని చెబుతున్నారు. మండలిలోని పరిశ్రమలకు వచ్చిన లాభాలద్వారా ఇచ్చిన విరాళాలతో ఈ నిధిని ఏర్పాటు చేస్తారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల కాంట్రాక్టర్ల కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఇచ్చిన హామీల చేదు అనుభవం ఇప్పటికే ఉన్నది. కార్మికుల సంక్షేమానికి కాంట్రాక్టర్ల దగ్గర నుంచి పన్ను వసూలు చేయాలి. ఆచరణలో పన్ను వసూలు చేయకుండానే బిల్లులు చెల్లించటం జరుగుతోంది. ఎక్కడైనా కొద్దిమంది కాంట్రాక్టర్ల నుంచి పన్నువసూలు చేసినా అది బాధిత కార్మికులకు చేరటంలేదు. మరొక చేదు అనుభవం మన ముందుంది. కార్పొరేట్ వర్గాలకున్న సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి కార్పొరేట్ సంస్థల ఆదాయంపై 2% రుసుము వసూలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించినపుడు కార్పొరేట్ సంస్థలు 2% రుసుము చెల్లించుటకు నిరాకరించాయి. 2% డబ్బు వసూలు కాదు, ఒక నైతిక నియమంగా దీనిని పెట్టవలసి వచ్చిందని సాక్షాత్తు ఆర్థిక మంత్రిగారే కార్పొరేట్ సంస్థల అధిపతులకు నచ్చచెప్పారు. సి.ఎస్.ఆర్.పట్ల కాని కార్మిక సంక్షేమంపట్లకాని బడా పెట్టుబడి యొక్క వైఖరి ఆ విధంగానే ఉంటుంది. పాలకులు కార్మిక సంక్షేమానికి అవసరమైన నిధిని కార్పొరేట్ వర్గాలనుండి వసూలు చేయవచ్చని ప్రభుత్వాలు మనలను విశ్వసించమంటున్నాయి. కార్మిక చట్టాలను తొలగించేటందుకు ప్రజల ఆమోదాన్ని పొందుటకు ఇది ఒక ప్రయత్నం తప్ప మరొకటికాదు. ఆకార్మిక చట్టాలను అమలు చేస్తున్నామని ఈ ఉత్పత్తి మదుపు మండళ్ళ నిర్వాహకులు తమకు తామే ధృవపత్రాన్ని జారీ చేస్తే సరిపోతుంది.

కార్మిక చట్టాలు అమలు అవుతున్నాయో లేదో తెలుసుకోవటానికి తనికీ అధికారులు వచ్చినపుడు ఈ స్వయం ధృవీకరణతో సరిపెట్టటానికి అనుమతిస్తున్నారు. ఇక మనం కార్మిక చట్టాలను మరిచి పోవచ్చు.

కార్మిక చట్టాల సరళీకరణకు, మహిళలతో మూడు షిఫ్టులతో పని చేయించడానికి, సిబ్బందిని తగ్గించటానికి, కాంట్రాక్టు కార్మిక చట్టాలను ఈ మండళ్ళలో వర్తింప చేయకుండా వుండటానికి, పనిగంటలను పెంచటానికి, సంఘాలలో చేరే కార్మికుల హక్కును పరిమితం చేయటానికి ఈ విధానం ఉద్దేశించబడినది.

దీనినిజాతీయ ఉత్పత్తి విధానం అని చెప్పినప్పటికీ ఉత్పత్తి మదుపు మండళ్ళలలో పనిచేసిన కార్మికులను బానిసల స్థాయికి దిగజార్చేటందుకే దీని రూపొందించారు. కార్మికులను అమానవీయులుగా బానిసలుగా మార్చటానికి ప్రజల ఆమోదాన్ని పొందుటకు మన పాలకులు చైనాను నమూనాగా చూపిస్తున్నారు. కాని చైనాలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో ఏ ఒక్క కార్మిక చట్టాన్నీ సడలించలేదని రెండవ జాతీయ కమీషన్ స్పష్టంచేసింది.

భారతదేశంలో ఉత్పత్తి వృద్ధి చెందక పోవటానికి పరిమిత కార్మిక చట్టాలు కారణం కాదు. దీనికి భిన్నంగా సామ్రాజ్యవాద నయాఉదారవాద ఆర్థిక విధానాలే అందుకు కారణంగా ఉన్నాయి. తయారీ రంగ అభివృద్ధి పేరుతో కార్మిక చట్టాలను తొలగించటం న్యాయ సమ్మతంకాదు. భారత కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఈ హక్కులు వదులు కోవడం భారత కార్మిక వర్గానికి ఆమోదయోగ్యం కాదు. D

**పది ప్రధాన...** (3వ పేజీ తరువాయి)

సాధించగల్గితే యావత్తు జాతీయ ఆర్థికం లాభపడుతుంది. వ్యవసాయం, లఘు పరిశ్రమలు అభివృద్ధి చెందేకొద్దీ, తన, మార్కెట్లకు, నిధులకు హామీ వుండటంతో భారీపరిశ్రమ మరింత వేగంగా అభువృద్ధి చెందుతుంది. అందుచేత పారిశ్రామికీకరణ నెమ్మదిగా సాగుతున్నట్లు కనిపించినా వాస్తవానికి అది అంత నెమ్మదిగా వుండదు. నిజానికి అది మరింత వేగం. కూడా వుండవచ్చు. మూడు పంచవర్ష ప్రణాళికల కాలం లేదా అంతకన్నా కొంచెం ఎక్కువ కాలంలో చైనా యొక్క సాంవత్సరిక ఉక్కు ఉత్పత్తిని 2 కోట్ల టన్నులకుగాని అంతకు మించిగాని పెంచవచ్చు. విముక్తికి పూర్వం అత్యధిక ఉత్పత్తి సాధించబడిన 1943లోని ఉక్కు ఉత్పత్తి 9 లక్షల టన్నులుంది. ఇది పల్లె ప్రజలను, పట్టణ వాసులను ఆనందపరుస్తుంది.

ఈ వేళ ఆర్థిక సమస్యలమీది విశ్లేషించి మాట్లాడటం నా ఉద్దేశ్యంకాదు. మన ఆర్థిక నిర్మాణం ఏడేళ్ళుగానే కొనసాగుతుంది, మనకింకా అనుభవం లేదు, దాన్ని పోగుపర్చుకోవాల్సిన అవసరం వుంది. విప్లవంలోకూడ, మనం మొదలుపెట్టినపుడు మనకు అనుభవంలేదు. అనేకసార్లు తలబొప్పికట్టిన తర్వాత అనుభవాన్ని సంపాదించుకున్న తర్వాతనే మనం దేశవ్యాపితంగా విజయాన్ని సాధించాం. విప్లవంలో అనుభవాన్ని పొందడానికి పట్టినకాలం కంటె తక్కువకాలంలో ఆర్థిక నిర్మాణంలో అనుభవాన్ని సంపాదించుకోడానికి, విప్లవానికి చెల్లించిన మూల్యానే చెల్లించాల్సి వుంటుంది. కాని విప్లవదశలో చెల్లించినంత ఎక్కువగా వుండబోదని ఆశిద్దాం. సోషలిస్టు సమాజ ఆర్థికాభివృద్ధి భౌతిక సూత్రాలకు, వాటిని గురించిన మన స్వీయాత్మక గ్రహింపుకు మధ్య ఇక్కడొక వైరుధ్యం - ఆచరణ క్రమంలోనే పరిష్కరించబడే వైరుధ్యం ఒకటి వున్నదని మనం తప్పక గ్రహించాలి. ఈ వైరుధ్యం విభిన్న వ్యక్తుల మధ్య వైరుధ్యంగా కూడా వ్యక్తమౌతుంది. అంటే యీ భౌతిక సూత్రాల ప్రతిబింబం సాపేక్షికంగా స్పష్టంగా వున్నవారికీ, సాపేక్షికంగా అస్పష్టంగా వున్నవారికీ మధ్య వైరుధ్యంగా వ్యక్తమౌతుంది. ఇదికూడా ప్రజలమధ్య వుండే వైరుధ్యమే. ప్రతి వైరుధ్యమూ ఒక భౌతిక వాస్తవికతే. వాటిని అర్థం చేసుకోవటం, మనకు చేతనయినంత సరిగ్గా దాన్ని పరిష్కరించడం మన కర్తవ్యం. D

# రైతులకందని పంటరుణాలు

**రైతుల** సేద్యానికి అత్యంత కీలకమైంది అందుకు కావాల్సిన పెట్టుబడిని సమకూర్చుకోవటం. అందుకు రైతాంగం అనేక అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం పంట ఖర్చులు పెరగటం, అందుకు అనుగుణంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటం, ఫలితంగా రైతులు నష్టాల పాలై అప్పుల్లో కూరుకుపోయి, తిరిగి సేద్యానికి కావాల్సిన పెట్టుబడి లేక వడ్డీవ్యాపారుల బారిన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సేద్యానికి కావాల్సిన పంట రుణాలను ప్రభుత్వమే పూర్తిగా అందించాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. ఇందుకోసం రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రతి సంవత్సరం సేద్యానికి ముందు పంట రుణాలు పెంచుతున్నామని, రైతులందరికీ రుణాలు అందించి, వడ్డీవ్యాపారుల బారిన పడకుండా చేస్తామని ప్రభుత్వం ఊదరకొడుతూనే ఉంది. ఆచరణ మాత్రం అందుకు విరుద్ధంగా ఉండి అత్యధిక మంది రైతులకు పంట రుణాలు అందటంలేదు. వారంతా అధికవడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తున్నది.

| జిల్లా | రుణాల లక్ష్యం (రు.కోట్లలో) | ఇప్పటికి అందినవి (రు.కోట్లలో) | శాతం |
|---|---|---|---|
| శ్రీకాకుళం | 607.04 | 66.42 | 11 |
| విజయనగరం | 464.98 | 102.00 | 22 |
| విశాఖపట్నం | 360.98 | 110.00 | 31 |
| తూర్పుగోదావరి | 1355.50 | 218.00 | 16 |
| పశ్చిమగోదావరి | 1478.88 | 600.00 | 41 |
| క్రిష్ణా | 1118.10 | 412.86 | 37 |
| గుంటూరు | 1706.15 | 600.00 | 35 |
| ప్రకాశం | 905.89 | 281.25 | 31 |
| నెల్లూరు | 486.82 | 125.00 | 26 |
| కర్నూలు | 1209.00 | 350.00 | 29 |
| అనంతపురం | 1811.70 | 1188.00 | 66 |
| కడప | 1075.00 | 410.00 | 38 |
| చిత్తూరు | 807.51 | 503.94 | 62 |
| మెదక్ | 543.90 | 180.00 | 33 |
| నిజామాబాద్ | 900.00 | 220.00 | 24 |
| వరంగల్ | 774.00 | 220.00 | 28 |
| కరీంనగర్ | 1224.30 | 425.00 | 35 |
| అదిలాబాద్ | 426.52 | 320.00 | 75 |
| రంగారెడ్డి | 391.64 | 180.00 | 46 |
| మహబూబ్‌నగర్ | 1095.00 | 208.00 | 19 |
| నల్గొండ | 810.00 | 205.88 | 25 |
| ఖమ్మం | 732.97 | 253.13 | 35 |

*సాక్షి దినపత్రిక 2-8-11* *పట్టిక-1*

| జిల్లా | ఇచ్చిన కార్డులు | మంజూరుఅయిన రుణం(కోట్లలో) | శాతం |
|---|---|---|---|
| శ్రీకాకుళం | 2391 | 58 | 0.07 |
| విజయనగరం | 23,416 | 400 | 0.18 |
| విశాఖపట్నం | 11,763 | 45 | 0.05 |
| తూర్పుగోదావరి | 66,781 | 4,120 | 12.00 |
| పశ్చిమగోదావరి | 85,809 | 7,087 | 15.68 |
| క్రిష్ణా | 52,774 | 3,005 | 7.80 |
| గుంటూరు | 40,470 | 22,928 | 50.01 |
| ప్రకాశం | 13,085 | 1,662 | 0.10 |
| నెల్లూరు | 25,000 | 2,050 | 5.90 |
| చిత్తూరు | 9,929 | 567 | 2.50 |
| కడప | 8,000 | 414 | 0.20 |
| అనంతపురం | 5,037 | 962 | 1.52 |
| కర్నూలు | 48,652 | 159 | 0.32 |
| మహబూబ్‌నగర్ | 24,648 | 483 | 0.99 |
| మెదక్ | 6,353 | 326 | 0.86 |
| నిజామాబాద్ | 7,807 | 110 | 0.60 |
| అదిలాబాద్ | 6,029 | 241 | 0.30 |
| కరీంనగర్ | 14,084 | 58 | - |
| వరంగల్ | 30,664 | 280 | 0.39 |
| ఖమ్మం | 31,533 | 508 | 6.57 |
| నల్గొండ | 31,291 | 0 | 0 |
| రంగారెడ్డి | 6,301 | 129 | 0.22 |
| మొత్తం | 5,46,131 | 40,972 | 7.50 |

*సాక్షి దినపత్రిక 2-8-11* *పట్టిక-2*

ప్రాధాన్యతా రంగాలకు కేటాయించిన బడ్జెట్ నుండి 18 శాతం వ్యవసాయ రంగానికి రుణాలు యివ్వాలని రిజర్వు బ్యాంక్ ఆదేశించినా, బ్యాంక్‌లు దాన్ని అమలు పర్చటం లేదు. ఏ సంవత్సరం కూడా ఆ మేరకు బ్యాంక్‌లు రైతులకు రుణాలు యివ్వటం లేదు. ప్రకటించిన మేరకు కూడా రైతులకు యివ్వకుండా మొండి చెయ్యి చూపుతున్నాయి. ప్రభుత్వం-బ్యాంకులు వచ్చిన ఒప్పందం మేరకు కూడా రుణాలు యివ్వటం లేదు.

గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 17,473.35 కోట్ల రూ॥ పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా జూలై 31 నాటికి 6,971.16 కోట్ల రుణాలు మాత్రమే అందాయి. ఆగస్టు మధ్యంతరానికల్లా పంటరుణాల షెడ్యూల్ పూర్తి అవుతుంది. మొత్తంగా చూసుకొంటే 12 వేల కోట్లకు మించి రైతులకు రుణాలు అందలేదు. ఇంకా ఆ సంవత్సరం రైతులకు యివ్వాల్సిన పంటరుణాలు 5,971 కోట్లు మిగిలి వున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో 20,285 కోట్లకు రుణాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ సంవత్సరం కూడా రుణాలు అందచేయటంలో ప్రభుత్వం, బ్యాంక్‌లు వైఫల్యం చెందాయి. ఇస్తామన్న పంటరుణాల్లో ఆగస్టు రెండు నాటికి రైతులకు అందింది 7,179 కోట్లు మాత్రమే. జిల్లాల వారీగా అందాల్సిన, అందిన పంట రుణాలను పరిశీలిస్తే రుణాల అందచేత వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.

పట్టిక-1ని పరిశీలిస్తే రెండు మూడు జిల్లాల్లో తప్ప మిగతా అన్ని జిల్లాల్లో 50 శాతం కూడా పంట రుణాలు అందలేదన్న యదార్థం బయటపడుతున్నది. అందుకే రైతులు పంట రుణాల కోసం ఆందోళనకు దిగక తప్పలేదు.

## ఎండమావిగా మారిన కౌలు రైతులకు రుణాలు

రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 25 లక్షలకు పైగా కౌలు రైతులు ఉన్నారు. భూమి ఉన్న రైతుకన్నా వీరికి అదనంగా కౌలు ఖర్చు ప్రాంతాలను బట్టి 10వేల నుండి 20 వేలదాకా ఉంది. మొత్తం ఎకరానికి 40 వేల దాకా కౌలు రైతులు పెట్టుబడి పెట్టాల్సివస్తున్నది. పత్తి, మిర్చి, పసుపు పంటలకు కౌలుతో సహా 40 వేల నుండి 80 వేల దాకా ఎకరా సేద్యానికి ఖర్చు పెట్టవలసి వస్తున్నది. వ్యవసాయ రంగంలో అమలు జరుగుతున్న ప్రపంచీకరణ విధానాల ఫలితంగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లి, కౌలు సేద్యానికి పేద రైతులు, కొందరు వ్యవసాయకూలీలు మళ్ళటం వలన కౌలు భూమికి డిమాండ్ పెరిగి కౌలు రేట్లు పెరుగుతూ వస్తున్నాయి. అనేక అవస్థలు పడి, అధిక వడ్డీలకు అప్పులు చేసి కౌలు సేద్యం కొనసాగిస్తున్నారు. ప్రకృతి నష్టాల వలన పంట నష్టపోతే పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకు పోవాల్సి వస్తున్నది. కౌలు దారీ చట్టం ఉన్నప్పటికీ అది వీరికి వర్తించక ప్రభుత్వం ప్రకటించే నామమాత్రపు సహాయం కూడా వీరికి అందటం లేదు. చివరికి ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. రైతుల ఆత్మహత్యల్లో వీరే ఎక్కువగా ఉండటం సంక్షోభానికి అద్దం పడుతున్నది.

ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కౌలు రైతులు, తమకు బ్యాంకు రుణాలు అందజేయాలని ఆందోళన చేపట్టారు. వారికి ప్రజా మద్దతు లభించటంతో, ప్రభుత్వం కౌలు రైతులకు బ్యాంక్‌ల నుండి రుణాలు యిప్పిస్తామని, అందుకు బ్యాంకులను ఒప్పిస్తామని, రైతులు బ్యాంకుల నుండి అప్పులు తీసుకోవచ్చని చెప్పటంతో, అది నమ్మిన కౌలు రైతులు, బ్యాంక్‌లకు వెళ్లితే అక్కడవారికి అవమానం ఎదురయింది. కౌలు పత్రాలు లేకుండా, హామీ లేకుండా రుణాలు యివ్వటం సాధ్యం కాదని బ్యాంక్‌ల గుమ్మమే ఎక్కనీయలేదు. ఆధారం లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వనప్పుడు, ప్రభుత్వం రుణాలు యిప్పిస్తానని చెప్పటంపై తీవ్రవిమర్శలు రావటంతో జాయింట్ లయబిలిటి (రైతుమిత్రగ్రూపులు) గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు యిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. ఈ గ్రూపుల్లో చేరేవారు ముందుగా వాటాధనం చెల్లించాలి. ఈ విధంగా చెల్లించింది బ్యాంక్‌ల్లో పెద్దఎత్తున డిపాజిట్ అవుతుంది. దానికి బ్యాంక్‌లు కొంత చేర్చి ఈ గ్రూపులకు యిస్తాయి. ఇలాంటి గ్రూపులకు కూడా నామమాత్రంగానే రుణాలు అందటం వలన ఆచరణలో ఈ పథకం కూడా విఫలమైయింది. పదిశాతం మందికే రుణాలు అందాయి. నలుగురు నుండి పదిమంది వరకు ఉన్న కౌలు రైతుల బృందాలకు ఎటువంటి హామీ లేకుండా ఒక్కొక్కదానికి లక్షరూపాయల వరకు యివ్వాలని రిజర్వుబ్యాంక్ చెప్పినా అది అమలు జరగటంలేదు.

ఈ పథకం కూడా ఆచరణలో విఫలమవటం, గత సంవత్సరం కౌలు రైతులు పంటలు కోల్పోయినా ఎటువంటి పరిహారం అందకపోవటం వలన ప్రభుత్వంపై కౌలు రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ వ్యతిరేకతను చల్లార్చటం కోసం కౌలుదారీ చట్టపరిధిలోకి రాని కౌలు రైతులకు రుణపరపతి కార్డులు అందజేస్తానని, అందుకు రుణపరపతి బిల్లు ముసాయిదాను ప్రవేశపెట్టింది. దీనిపై అభిప్రాయ సేకరణ తతంగం జరిపి తుదిముసాయిదాను శాసన సభలో ప్రవేశపెడతానని చెప్పి, అలా చేయకుండా, 8-6-11న హడావుడిగా కౌలు రైతు ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.

ఈ ఆర్డినెన్స్ ద్వారా గ్రామ సభలు జరిపి కౌలుదారుల ఎంపిక జరిపి, కార్డులు అందచేస్తానని, ఆ కార్డులద్వారా బ్యాంక్‌లద్వారా రుణాలు పొందవచ్చని చెప్పింది. ఆ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు. 5.46 లక్షలమంది కౌలు దారులకు మాత్రమే ఇప్పటి వరకు కార్డులు అందాయి. అంటే ఈ సంవత్సరం కౌలు రైతులందరికీ రుణ అర్హతకార్డులు అందవనేది స్పష్టమౌతున్నది. కార్డులు అందిన వారిలో 7% మందికే రుణాలు లభించాయి. ఆగస్టు మొదటివారం వరకు జిల్లాల వారీగా అందిన కార్డులు-రుణం గమనిస్తే కార్డుల ప్రక్రియ బండారం బయట పడుతుంది.

పట్టిక-2ను పరిశీలించినప్పుడు అనేక జిల్లాల్లో ఒకశాతం మందికి కూడా రుణాలు అందలేదని వెల్లడయింది. కౌలు రైతులు రుణాలు తీసుకోవటానికి భూయజమానులు అంగీకరించకపోవటం, ఆధారం లేకుండా రుణాలు ఇవ్వబోమని బ్యాంక్‌లు కరాఖండిగా చెప్పటమే అందుకు కారణం. ఈ విషయం తెలిసికూడా కార్డుల ద్వారా రుణాలు అందుతాయని చెప్పటం కౌలు రైతులను మభ్యపరచటమేగదా! కార్డులు ఇవ్వడం ద్వారా కౌలు రైతులుగా గుర్తించినప్పుడు, బ్యాంకులకు తానే హామీగా ఉండి ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు యిప్పించే ఏర్పాట్లు ఎందుకు చేయటంలేదు? ఇదంతా గమనించినప్పుడు కౌలు రైతులకు రుణాలు యిప్పించే చిత్తశుద్ధి పాలకులకు లేదని, భ్రమల్లో ఉంచటమే ధ్యేయంగా పెట్టుకొందని వెల్లడౌతున్నది.

రైతు మిత్ర గ్రూపులుగా ఏర్పడితే రుణాలు యివ్వటానికి అభ్యంతరం లేదని, అది కూడా ఈ సంవత్సరం అందరికీ ఇవ్వలేమని బ్యాంక్‌లు స్పష్టపరిచాయి. దీన్ని గమనిస్తే బ్యాంక్‌లు, ప్రభుత్వం కలసి, కౌలు రైతులను, రైతు మిత్ర గ్రూపులుగా ఏర్పడమని చెప్పకనే చెబుతున్నాయి.

ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టిన తర్వాత 1990 నుండి వ్యవసాయ రుణాలు 64%గా ఉంటే 1992 నాటికి 57శాతానికి పడిపోయాయి. ఇదే తరుణంలో వడ్డీ వ్యాపారుల నుండి రైతాంగం తీసుకొన్న రుణం 10.05 నుండి 19.06 శాతానికి పెరిగింది. బ్యాంక్ రుణాలు అందకపోవటం వలన మన రైతులకు రుణభారం పెరుగు తున్నదని అనేక సర్వేలు వెల్లడించాయి. 2000 సంవత్సరం నుండి రైతాంగానికి యిచ్చే వ్యవసాయ రుణాలు పెరుగు తున్నట్లు, 2004-05 నుండి 2007-08 సంవత్సరాల మధ్య రుణాలు రెట్టింపు చేసినట్లు యు.పి.ఏ. ప్రభుత్వం రైతాంగాన్ని మభ్యపెడుతున్నది. ఎరువులు, క్రిమిసంహారక మందుల సరఫరా డీలర్లకు, ఇరిగేషన్ పరికరాలు సరఫరా చేసేవారికి, ఎస్.సి.,ఎస్.టి.లకు యిచ్చిన రుణాలను కూడా వ్యవసాయ రుణాలుగా చెబుతూ ప్రభుత్వం మోసం చేస్తున్నది. అంతేకాకుండా 10 నుండి 25 కోట్ల దాకా యిచ్చే రుణాలు కూడా వ్యవసాయ రుణాల్లో జమపడుతున్నాయి. అందువలన రైతాంగానికి యిచ్చే రుణాలు రెట్టింపు అయ్యాయని ప్రభుత్వం చెప్పటం వంచన తప్ప మరొకటికాదు.

పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఎరువుల ధరలు తగ్గింపుతో పాటు, వాటి కొరతను నివారించాలని, కౌలు రైతులతో సహా రైతులందరికీ తక్షణమే పంట రుణాలు అందించాలని సమైక్యంగా ఉద్యమించాలి. D

# మంచికల్లు దళితులఆందోళనకు సంఘీభావం

**పిడుగురాళ్ళ, 8-8-11:** గుంటూరుజిల్లా రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీల గుడిశలను తగులబెట్టి, వారిని కులం పేరుతో తిట్టి అవమానపరిచిన అగ్రకులస్థుడైన ఏల్చూరి వెంకటేశ్వర్లు మరియు వారి కుటుంబ సభ్యులను అరెస్ట్‌చేసి శిక్షించాలని డిమాండ్‌చేస్తూ వివిధ ప్రజాసంఘాల అండదండలతో స్థానిక ప్రజలు ఆందోళన సాగిస్తున్నారు.

మంచికల్లు గ్రామ దళితుల న్యాయమైన ఆందోళనకు సంఘీభావంగా స్థానిక రైతుకూలీ సంఘం (ఆం.ప్ర), స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో పిడుగురాళ్ళలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జానపాడు రైల్వేగేట్ నుండి ఎం.ఆర్.ఓ. కార్యాలయంవరకు ఈ ప్రదర్శన సాగింది.

మంచికల్లు గ్రామంలోని దళితుల అధీనంలోని నివాసస్థలాలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, దళితులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘంజిల్లా నాయకులు కా॥నీలాద్రి రాంబాబు; స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ఎమ్.నిర్మల; స్థానిక నాయకులు పోలేసు, కాశిం, శ్రీను తదితరులు పాల్గొన్నారు. D

**ప్రజాయుద్ధ పంథాలో ...** (చివరి పేజీ నుండి )

(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి. వర్మ, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పండా, చాషీమూలియా ఆదివాసీ సంఘం నాయకురాలు కా॥ కిర్మ, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) విజయనగరం జిల్లా నాయకులు కా॥ భాస్కరరావు, ఒడిషా మహిళా సంఘం నాయకురాలు భవాని భూయీ తదితరులు పాల్గొని కా॥ అర్జున్‌కు నివాళులర్పిస్తూ, కా॥ అర్జున్ ఆశయాలను ముందుకు తీసుకు వెళతామని ప్రతినబూనుతూ ప్రసంగించారు.

కా॥ అర్జున్ వర్ధంతి సభ గురించి చాషీమూలియా ఆదివాసీ సంఘం కార్యకర్తలు-ఆదివాసుల మధ్యన, గ్రామాలు, సంతల్లో విస్తృత ప్రచారం చేశారు. సభాస్థలాన్ని 'కామ్రేడ్ అర్జున్‌కు లాల్‌సలామ్' బ్యానర్లతోనూ, కామ్రేడ్ అర్జున్ చిత్రపటాలతోనూ ఎర్రతోరణాలతోనూ స్ఫూర్తిదాయకంగా అలంకరించారు. యాభైకిపైగా గ్రామాలనుండి ఆదివాసులు కామ్రేడ్ అర్జున్ వర్ధంతి సభకు హాజరై తమ ప్రియతమ నాయకునికి జోహార్లర్పించటంతో పాటుగా మావోయిస్టులు సాగించిన ఈ హత్యను ఎలుగెత్తి ఖండించారు. D

చదవండి!
అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు
సామ్రాజ్యవాదుల కుట్రలు
వెల : 15/-
కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

కాంతి కేంద్రాలా!
మృత్యు మందిరాలా ?
పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ.పి.డి.ఆర్. అధ్యయనబృందం నివేదిక
వెల: రు. 15/-
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి, ఏలూరురోడ్, విజయవాడ

# భావనపాడు బీచ్‌శాండ్ ప్రాజెక్ట్

# సముద్ర తీర ప్రాంతానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న ఇసుక త్రవ్వకాలకు అనుమతినిచ్చిన పాలకులు

మన రాష్ట్రంలోని తీరప్రాంతం అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల ప్రమాదాన్నేగాక, బీచ్‌శాండ్ మైనింగ్ రూపంలో మరో పెనుముప్పును ఎదుర్కొంటున్నది. శ్రీకాకుళం జిల్లాలోని 192 కిమీ సముద్రతీర ప్రాంతమంతటా ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతులిచ్చివేసింది. జిల్లాలోని గారమండలం వత్సవలసవద్ద 300 కోట్ల రూ॥ వ్యయంతో తీరప్రాంతంలో ఇసుకను తవ్వితీసి, అందులోని విలువైన ఖనిజాలను వేరుచేసే పరిశ్రమ ప్రారంభించబడి పనిసాగిస్తున్నది. అదేవిధంగా నెల్లూరు జిల్లా తీరప్రాంతంలోని తడ, కోట, చిల్లకూరు, కావలి, వాకాడు మండలాల్లో 10 వేల ఎకరాల్లో శాండ్‌మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతించి కొనసాగిస్తున్నది. అనుమతులు తీసుకున్న ప్రాంతంలోనే కాకుండా తీరంలోని ఇతర ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా ఇసుక త్రవ్వకాలు సాగుతున్నాయి.

కాగా, బీచ్‌శాండ్ మైనింగ్ పరిశ్రమ రెండో దశ విస్తరణలో భాగంగా ప్రభుత్వం శ్రీకాకుళంజిల్లాలోని సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని భావనపాడు, కొమర్లాడ ప్రాంతంలో 700 కోట్ల రూ॥ అంచనావ్యయంతో సామ్రాజ్యవాద ట్రైమెక్స్ సంస్థకు చెందిన బీచ్‌శాండ్ మైనింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు అనుమతినిచ్చింది. 4,470 ఎకరాల తీరప్రాంత భూములను ఈ తవ్వకాలకోసం ప్రభుత్వం ట్రైమెక్స్‌కు కట్టబెడుతున్నది. సంతబొమ్మాళి మండలంలోని రాజాపురం, భావనపాడు; వజ్రపుకొత్తూరు మండలంలోని దేవనల్తాడ, సూర్యమణిపురం మొదలైన మొత్తం 115 గ్రామాలు; అందులోని 1,67,775 మంది ప్రజానీకం-తక్షణం ఈ పరిశ్రమ బాధితులుగా మిగలనున్నారు.

బీచ్‌శాండ్ మైనింగ్ మొదటి దశను పూర్తిచేసుకున్న ఈ సంస్థపై ప్రభుత్వం ఇప్పటికే అనేక రాయితీల జల్లు కురిపించింది. ఈ పరిశ్రమకు కావలసిన మౌలిక సదుపాయాల(రోడ్లు, విద్యుత్, నీటివసతి తదితరాలు) కల్పనలకోసం ప్రభుత్వం 5 కోట్ల రూ॥సహాయం చేసేందుకు అంగీకరించటమేగాక, అనేక పన్ను రాయితీలను కూడా 'ఉదారంగా' ప్రకటించింది. ఈ మొత్తం రాయితీల విలువ వందలకోట్ల రూ॥గా వుంది.

బీచ్‌శాండ్ మైనింగ్ కారణంగా, తీరప్రాంతం ఇప్పటికే అనేక సమస్యలనెదుర్కొంటున్నది. ముఖ్యంగా తీరప్రాంత మత్స్యసంపద క్షీణించిపోతున్నది. తీరప్రాంత భూగర్భజలాలు అడుగంటిపోవటంతోపాటుగా, క్రమంగా అవన్నీ ఉప్పునీరుగా మారిపోనున్నాయి. ఇసుకను శుద్ధి చేసేందుకు, అందునుండి ఖనిజాలను వెలికితీసేందుకు ఉపయోగించే విషరసాయనాల ఫలితంగానూ, ఈ పరిశ్రమనుండి వెలువడే కాలుష్య కారణంగానూ తీరప్రాంతంలోని అరుదైన జీవ,వృక్ష, జంతుజాతులు అంతరించిపోయే ప్రమాదముంది. ఓపెన్‌కాస్టు పద్ధతుల్లో సాగే ఈ తవ్వకాలవలనూ, ఇసుకనుండి ఖనిజాలను వేరుచేసే ప్రక్రియలలోనూ ధ్వనికాలుష్యం, వాయు కాలుష్యం తీవ్రంగా వుంటాయి. ఈ దుమ్ము, ధూళి ఫలితంగా పరిసర గ్రామాల్లోని ప్రజలకు అనేకశ్వాసకోస సంబంధ జబ్బులు సంక్రమిస్తాయి. అంతేగాక, ఈ ధూళి కమ్ముకోవటంతో తీరప్రాంతంలో ఉప్పుమడులు నాశనమై పోతాయి. ఉప్పు రైతాంగం తీవ్రంగా నష్టపోతారు.

బీచ్‌శాండ్ పరిశ్రమ యాజమాన్యంతో కుమ్మక్కు అయిన ప్రభుత్వంచేసే వాగ్దానాలు, ఇచ్చే హామీలన్నీ నీటిమూటలే. తీరప్రాంత ఇసుక తవ్వకాల పరిశ్రమ ద్వారా అదనపు ఉపాధి లభ్యత శూన్యంకాగా, ఇప్పటికే తీరప్రాంతంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల జీవనం సంక్షోభంలో చిక్కుకుంటుంది.

సంతబొమ్మాళి మండలంలో ఇసుకను శుద్ధి చేసేందుకు సముద్రపు నీటినే ఉపయోగిస్తామని ట్రైమెక్స్ సంస్థ యాజమాన్యం ప్రకటిస్తున్నది. కానీ మరోవైపున వంశధార నదీజలాల వినియోగానికి సంబంధించి ప్రభుత్వంనుండి ట్రైమెక్స్ యాజమాన్యం అనుమతులను కూడా పొంది ఉండటాన్నిబట్టి వారు చెబుతున్న విధంగా సముద్ర జలాలపై ఆధారపడకుండా ఇసుక శుద్ధి చేసేందుకు నదీజలాలనే వినియోగించనున్నట్లు స్పష్టమౌతున్నది. ఇదే జరిగితే, ఈ నదీజలాలపై ఆధారపడిన ఆయకట్టు రైతాంగానికి తీవ్ర సాగునీటి కొరత ఏర్పడుతుంది.

ఇసుకలోవున్న సారవంతమైన ఒండ్రుమట్టిని పూర్తిగా తొలగించి, ఆ మిగిలిన ఇసుకతోనే తవ్వితీసిన గోతులను నింపి మొక్కలను పెంచుతామని పరిశ్రమ యాజమాన్యం - ప్రజలను, పర్యావరణవాదులను సమాధానపరచ జూస్తున్నది. ఈ ప్రాంతంలో తీరంవెంబడి ఒండ్రు మట్టిశాతం తగిన మోతాదులో ఉండటంవలననే జీడిమామిడి, కొబ్బరివంటి పలురకాల తోటలు పెద్దఎత్తున దిగుబడులనిస్తున్నాయి. కానీ, ఇసుకశుద్ధిచేసే క్రమంలో ఒండ్రుమట్టిని తొలగించిన పిదప ఇసుకలో ఏ పంటలూ సరైన దిగుబడినీయవనేది స్పష్టమే!

సముద్ర తీరానికి ఆనుకునివున్న 500 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలూ, తవ్వకాలూ జరపరాదనే తీరప్రాంత నియంత్రణ నిబంధనలన్నింటికీ తుంగలోతొక్కి ఈ బీచ్‌శాండ్ పరిశ్రమకు పాలకులు అనుమతు లిచ్చారు. ఇసుక తిన్నెలు తవ్వితీసి, ఖనిజాలను వేరుచేసిన పిదప అక్కడ మెత్తనిపొడి మాత్రమే మిగులుతుంది. తీరప్రాంత ఇసుక తిన్నెలన్నింటినీ తవ్విపోయడం కారణంగా తీరప్రాంతానికి పెట్టని కోటలుగా, వందల, వేల సంవత్సరాలుగా సహజ సిద్ధంగావున్న ఇసుక తిన్నెలన్నీ తరిగిపోవటంతో సునామీలు, తుపాన్లు సంభవించినపుడు సముద్రం మరింత ముందుకు చొచ్చుకుని వచ్చి తీరప్రాంత గ్రామాలను ముంచెత్తే ప్రమాదముంది.

కాగా, ఇసుక తవ్వకాలవలన, తీరప్రాంతానికిగానీ, తీరప్రాంతవాసులకుగానీ నష్టమేమీ ఉండబోదని ట్రైమెక్స్ యాజమాన్యం బుకాయిస్తున్నది. తీరంవెంబడి తవ్వి పోసిన ఇసుకలో 23 శాతాన్నే తాము వినియోగించు కుంటామనీ, మిగిలిన ఇసుకనంతా తవ్వినచోటే తిరిగి నింపుతాము కనుక ప్రకృతి విపత్తుల నుండి ఇబ్బందేమీ ఉండదంటోంది. వందల, వేలఏళ్ళుగా స్థిరపడిన ఇసుక తిన్నెలను తవ్వితీసి, ఆపై మరలా నింపినప్పటికీ తీరప్రాంతాన్ని పూర్వస్థితికి చేర్చటం అసాధ్యం. రానున్న కాలంలో ఈ ప్రాంతం తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కో బోతున్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

బీచ్‌శాండ్ మైనింగ్‌కు అనుమతులిచ్చివేసిన ప్రభుత్వం బూటకపు ప్రజాభిప్రాయ సేకరణద్వారా తన చర్యకు ప్రజామోదాన్ని పొందే వ్యర్థ ప్రయత్నం చేసింది. ఇప్పటికే జిల్లాలో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలపట్ల, దాని దుష్ఫలితాలపట్ల తీవ్ర వ్యతిరేకతతోనున్న ప్రజలు తమ ప్రాణాలను అడ్డువేసైనా సరే ఈ తవ్వకాలను అడ్డుకుంటామని చెప్తున్నారు.

ఆగస్టు 11వ తేదీన భావనాపాడు ప్రాంతంలో బీచ్‌శాండ్ మైనింగ్ అనుమతుల విషయమై ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ తంతుగా ముగిసింది. వేలాది మంది సాయుధ పోలీసుల పహారా నడుమ సాగిన ఈ తతంగానికి ముందుగా బీచ్‌శాండ్ మైనింగ్ ప్రభావిత ప్రాంత ప్రజలకు తెలుగుభాషలో పర్యావరణ నివేదికను అందజేయాలనే కనీసపాటి పద్ధతులను కూడా ప్రభుత్వం పాటించలేదు.

ఇన్ని అడ్డంకుల నడుమ కూడా ప్రజలు తీర ప్రాంత ఇసుక తవ్వకాలపట్ల తమ భయాందోళనలను, ఈ పరిశ్రమపట్ల తీవ్రవ్యతిరేకతను స్పష్టంగా వ్యక్తంచేశారు. బీచ్‌శాండ్ మైనింగ్ వ్యతిరేక ఆందోళనలో ఈ ప్రాంత మహిళలు చురుకైన పాత్ర వహిస్తున్నారు. ట్రైమెక్స్ సంస్థ యాజమాన్యం గ్రామాల్లోని నోరుగల వ్యక్తులకు డబ్బును ఎరగావేసి, వారిని లోబరుచుకునేందుకు చేసిన ప్రయత్నాలను ముఖ్యంగా మహిళలు పలుచోట్ల అడ్డుకున్నారు. డబ్బుకు లోబడిన కొందరు వ్యక్తులు ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా తమ సమ్మతిని తెల్పగా, ప్రజానీకమంతా ఒక్కగొంతుకతో బీచ్‌శాండ్ మైనింగ్ పరిశ్రమను వ్యతిరేకించారు.

మన దేశానికి మూడుదిక్కులావున్న సముద్రతీర ప్రాంతంపై ఆధిపత్యంకోసం సామ్రాజ్యవాదులు తమ చర్యలను వేగవంతం చేస్తున్నారు. సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే పాలకులు-తీరంలో చొరబాటుకు ఎంతో కొంత అడ్డుగానున్న తీరప్రాంత నియంత్రణా చట్టాన్ని వివిధ రూపాల్లో క్రమంగా నీరుగారుస్తూ వచ్చారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో సెజ్‌ల పేరిట, కోస్టల్ కారిడార్‌లపేరిట, కనీసపాటి నియమనిబంధనలన్నింటికీ తిలోదకాలిచ్చి తీరాన్ని సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకప్పగించే చర్యలను పాలకులు తీవ్రంచేశారు. ఈ విధానాలపట్ల తీరప్రాంత ప్రజానీకంలో వ్యక్తమయ్యే అసంతృప్తి, ఆందోళనలను క్రూరంగా అణచివేసే చర్యలు చేపట్టారు. సాంప్రదాయక మత్స్యకారుల చేపలవేటను బడా, కార్పోరేట్, సామ్రాజ్యవాద ట్రాలర్లకు బలిచేశారు. సముద్రమార్గాన ముస్లిం తీవ్రవాదులు మనదేశంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టిస్తున్నారని బూచిని చూపి తీరప్రాంతంలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు కోస్టల్ గార్డ్స్ వ్యవస్థను పటిష్టంచేస్తూ, మెరైన్ పోలీస్‌స్టేషన్లను పెంచివేస్తున్నారు.

జపాన్‌లోని ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్రంలో ఏర్పడిన పరిణామాల అనంతరం వివిధ ప్రపంచ దేశాలలో ప్రజల అలజడి తీవ్రమైన కారణంగా ఆయా దేశాల ప్రభుత్వాలు అణువిద్యుత్ కేంద్రాల స్థాపనను విరమించటమో, తాత్కాలికంగా మూసివేయటమో చేస్తూవుండగా, రెట్టించిన ఉత్సాహంతో మన దేశ పాలకులు ప్రమాదాలేవీ ఉండబోవని హామీలిస్తూ అణువిద్యుత్ కేంద్రాలను-అదీ సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటుచేసేందుకు అనుమతులిచ్చారు.

మన రాష్ట్ర తీరప్రాంతంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో అణువిద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన సాగిస్తున్నారు. అత్యంత కాలుష్యకారక థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఇబ్బడి ముబ్బడిగా (ఒక్క నెల్లూరుజిల్లా తీరంలోనే 24) అనుమతులు ఇచ్చారు. పర్యావరణానికీ, ప్రజల ప్రాణాలకీ, సముద్ర జీవజాలానికీ ప్రమాదకరమైన ఓడలను పగులగొట్టే పరిశ్రమలను గుజరాత్ రాష్ట్రంలోనూ, మన రాష్ట్రంలోని నిజాంపట్నం తీరప్రాంతంలోనూ స్థాపనకు చర్యలు చేపట్టారు. తీరప్రాంతంలోనే ప్రమాదకారమైన, కాలుష్య కారకమైన పెట్రో, కెమికల్ పరిశ్రమలను స్థాపించేందుకు సమ్మతించారు.

వీటన్నింటికీ తోడుగా మన ప్రభుత్వరంగ మైనింగ్ కార్పోరేషన్‌ను శిఖండిగా అడ్డుపెట్టి విదేశీ బహుళజాతి సంస్థలకు బీచ్‌శాండ్ మైనింగ్‌కు అనుమతులిచ్చారు. ఇప్పటికే తీరప్రాంతానికి రక్షణ కవచంగావున్న మడ అడవులను పాలక ప్రభుత్వాలు వివిధ ప్రాజెక్టులపేరిట విచ్చలవిడిగా విధ్వంసం గావిస్తూవస్తున్నాయి. మడ అడవుల విధ్వంసం, ఇసుక తిన్నెల అదృశ్యంతో తీరప్రాంత మనుగడే తీవ్ర ప్రమాదాన్నెదుర్కొంటున్నది-తీరప్రాంత మత్స్యకారులు, రైతులు, వ్యవసాయకూలీలు, చేతివృత్తుల గ్రామీణ పేదలు, ఉప్పురైతులు తదితర ప్రజానీకం-ముఖ్యంగా తీరప్రాంతంపై ఆధారపడి జీవించేవారి మనుగడే ప్రశ్నార్థకమౌతున్నది.

దేశంపట్ల, ప్రజలపట్ల ఇసుమంతైనా ఆసక్తి, బాధ్యతలేని పాలకులు సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి, మన దేశాన్ని-దేశ సహజ సంపదలను అందులో భాగంగా వ్యూహాత్మకంగా కీలకమైన దేశ తీరప్రాంతాన్ని సామ్రాజ్యవాదులు, వారి బహుళజాతి పరిశ్రమల లాభాల సముపార్జనకోసం, దోపిడీ ప్రయోజనాలకోసం బలిపెట్టబోవటాన్ని జాతీయ భావాలున్న ప్రతి ఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాలి. దీనిలో భాగంగానే ప్రభుత్వం శ్రీకాకుళంలో అనుమతులిచ్చి సాగిస్తున్న బీచ్‌శాండ్ మైనింగ్‌ను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్‌చేస్తూ ప్రజానీకం ముఖ్యంగా తీరప్రాంతవాసులంతా సమైక్యపోరాటం సాగించాలి. D

# బీడీ కార్మికుల ఆందోళనకు సంఘీభావం

బీడీ కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ. 41ని యథాతథంగా అమలు చేయాలని, బీడీ కార్మికులందరికీ నెలకి కనీసం 26 రోజులు పని కల్పించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి-బహుళజాతి కంపెనీల నుండి, ప్రభుత్వ అధిక పన్నుల భారాలనుండి దేశీయ పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను రక్షించుకొనేందుకు కార్మిక పోరాటాలకు అండగా యాజమాన్యాలూ కలిసిరావాలని - ఏ.పి.ఎఫ్.టి.యు. రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న పిలుపునిచ్చారు.

ఏ.పి.ఎఫ్.టి.యు; రై.కూ.సం. (ఆం.ప్ర.)లు గత సంవత్సరం జరిగిన సమ్మెలో తెలంగాణాలోని వివిధ ప్రాంతాల్లో సమ్మెను బలపరుస్తూ ప్రచారం సాగించారు. ప్రస్తుత పరిణామాలపై ఏ.పి.ఎఫ్.టి.యు. రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్స్ సి. పెద్దన్న, రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ వి.కిషోర్, మోడెం మల్లేష్, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు జి. నర్సయ్య, యువజన నాయకులు బి. రవీందర్‌లు నిజామాబాద్, కరీంనగర్‌లలో 2011 అగస్టు 11,12 తేదీలలో పత్రికా విలేఖరుల సమావేశాలను నిర్వహించారు. వాటిల్లో జీ.ఓ 41ని విడుదల చేయటంలో జరిగిన కార్మిక పోరాటాలను వివరించారు. బీడీ కార్మికులకు పెద్దపెద్ద కంపెనీలలో సైతం 15 రోజులకి మించి పని దొరకటం లేదని, కార్మికులందరికి 26 రోజులు పని కల్పించి చట్టపర సౌకర్యాలను కార్మికులకు కల్పించాలని యాజమాన్యాలకు విజ్ఞప్తి చేసారు. అదే సమయంలో బహుళజాతి సిగరెట్టు కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం దేశీయ పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలనూ, పన్నుల విధానాన్ని విమర్శిస్తూ యాజమాన్యాలు కార్మికుల సమస్యలను పరిష్కరించి బీడీ పరిశ్రమ రక్షణకై కార్మికులు చేస్తున్న పోరాటాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. D

**ప్రజానాయకుడు...** (2వ పేజీనుండి)

చేస్తున్నారని, వాటిపై ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయోగిస్తున్నదని చెప్పారు. జనలోక్‌పాల్ బిల్లుతోనో, అందులో ప్రధానమంత్రిని చేర్చటంతోనో అవినీతి అంతంకాదని, ప్రస్తుత వ్యవస్థను సమూలంగా మార్చినప్పుడే అవినీతితో పాటు, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. గ్రామీణపేదలు, రైతాంగం సమైక్యంగా సమస్యల పరిష్కారానికి ఉద్య మించటమే కా॥ వెంకటేశ్వర్లుకు అర్పించే నిజమైన నివాళిగా ఆయన పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఎన్.లలితకుమారి మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలను పాలకులు ఎలా నీరుగారుస్తున్నదీ వివరించారు. రైతుల సమస్యకు క్రాప్‌హాలిడే పరిష్కారం కాదనీ, ప్రకాశంజిల్లాలో పొగాకు రైతుల అనుభవాన్ని వివరించారు. దేశాన్ని సామ్రాజ్య వాదులకు, బహుళజాతి సంస్థలకు పాలకులు తాకట్టుపెట్టారని, అన్నిరంగాల్లో సామ్రాజ్య వాదుల ఆధిపత్యం కొనసాగుతున్నదనీ, ప్రజలు చైతన్య వంతులు కాకుండా సారామత్తులో ముంచుతున్నారనీ, సారావ్యాపారం ప్రతిపల్లెకూ వ్యాపించిందనీ, పేదలను దోచుకుంటున్నారనీ చెప్పారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా పరిశ్రమలు మూతపడి కార్మికులు నిరుద్యోగానికి గురౌతున్నారని అన్నారు. పేద ప్రజలందరూ సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఓపిడిఆర్ జిల్లా నాయకులు కా॥కొల్లాటి నాగరాజు గ్రామంలో పెత్తందార్లకు, రౌడీలకు వ్యతిరేకంగానూ, అగ్రకుల పెత్తందార్లు, బలహీన వర్గాలపై జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగానూ, పేదల హక్కులకోసం కా॥ వెంకటేశ్వర్లు పోరాడారని చెప్పారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాపాడటానికి కా॥ వెంకటేశ్వర్లుతో పనిచేసిన అనుభవాన్ని వివరించారు. వాన్‌పిక్ ప్రమాదం ఇంకా పొంచి ఉందని, ప్రజలు తమ హక్కులకోసం పోరాడాలని పిలుపుయిచ్చారు.

ఇంకా ఈ సభలో కా॥ నాయుడు శ్రీనివాసరావు; పీతా వెంకటేశ్వర్లు పెద్దకుమారుడు పీతా సుబ్బారావు తదితరులు పాల్గొని కా॥ వెంకటేశ్వర్లుకు నివాళులర్పించారు. D




కాపీలకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి,
అరండల్‌పేట,
విజయవాడ

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**సామ్రాజ్యవాద కంపెనీల అనైతిక ఔషధ ప్రయోగాలు**
వెల: 12/-
కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# ‘ప్రజాయుద్ధ పంథాలో భూమి-భుక్తి-విముక్తి సాధించుకోవడమే కా॥ అర్జున్‌కు అర్పించే నివాళి’

## కా॥ అర్జున్ ప్రథమ వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన



కామ్రేడ్ అర్జున్ వర్ధంతి సభకు హాజరైన ప్రజానీకం; స్థూపం వద్ద నివాళులు; వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ శ్రీకాంత్ మొహంతి, వేదికపై కా॥ కోటయ్య, పైడమ్మ, మాలిక్, ఝూన్సి, కిర్మ, ఇతరులు

**బందుగాం(ఒరిస్సా), 9-8-11 :**

**ఆంధ్ర-ఒరిస్సా** సరిహద్దు చాషీమూలియా ఆదివాసీ ఉద్యమనేత, కోరాపుట్ జిల్లా సంఘ కార్యదర్శి కా॥ కేంద్రుక అర్జున్‌ను ‘పోలీస్ ఏజంట్’గా ముద్రవేసి, మావోయిస్టుల సాయుధదళం హత్యగావించి సంవత్సర కాలం గడిచింది. కా॥ అర్జున్ ప్రథమ వర్ధంతి సభ ఒరిస్సా రాష్ట్రం - బందుగాం బ్లాకు - ఏడుగుమ్మాల వలసలో చాషీమూలియా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో జరిగింది.

సభ ప్రారంభానికి ముందుగా ఏడుగుమ్మాలవలసకి 10కిలోమీటర్ల దూరం నుండి డప్పు డ్యాన్సులతో, సాంప్రదాయక గిరిజన నృత్యాలతో, మావోయిస్టుల హత్యావిధానాలని ఎలుగెత్తి ఖండిస్తూ, కా॥ అర్జున్ స్మృతిలో పాటలు పాడుకుంటూ పరిసరగ్రామాల ఆదివాసులు సభాస్థలివద్దకు తరలివచ్చారు. అలమండ కేంద్రంగా వందలాదిమంది ఆదివాసీ పేద శ్రామిక యువతీయువకులు డప్పు నృత్యాలతో, హోరెత్తించే నినాదాలతో ఐదు కిలోమీటర్లు ప్రదర్శనగా సాగి సభాస్థలికి చేరుకున్నారు. ‘జోహార్ క్రామ్రేడ్ అర్జున్’ అనే వేలాది మంది ఆదివాసీల నినాదాల నడుమ ఏఐకెఎంకెఎస్ కోకన్వీనర్; రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝూన్సీ తొలుత ఎర్రజెండాను ఆవిష్కరించిన అనంతరం, కా॥ అర్జున్ స్థూపానికి పూలమాలవేసి జోహార్లు చెప్పారు. కార్మిక నాయకులు కా॥ గణేష్ పండా వేదికపైకి ఉపన్యాసకులను ఆహ్వానించగా, చాషీ మూలియా ఆదివాసీ సంఘం నాయకురాలు కా॥ పైడమ్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. సభా ప్రారంభానికి ముందుగా అందరూ లేచి నిలుచుని కా॥ అర్జున్ స్మృతిలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కా॥ అర్జున్ త్యాగమయ జీవితాన్ని వివరిస్తూ ఒరియా, తెలుగు భాషలలోనూ, అర్జున్ మాతృభాష ‘కుయి’లోనూ ప్రజాకళాకారులు పాటలు పాడి సభికులను ఉద్విగ్నభరితుల్ని చేశారు.

చాషీమూలియా ఆదివాసీ సంఘం ఒడిషా రాష్ట్ర కన్వీనర్ కా॥ శ్రీకాంత్ మొహంతి ప్రసంగిస్తూ మావోయిస్టులు కా॥ అర్జున్‌ను భౌతికంగా హత్యచేసినా, ప్రజల మనుసల నుండి దూరంచేయలేక పోయారన్నారు. బందుగాం, నారాయణపట్న ప్రాంతాలలో కా॥ అర్జున్ నాయకత్వంలో భూముల కోసం, అటవీ హక్కుల పరిరక్షణకోసం; సారాను వ్యతిరేకిస్తూ, పోలీసు, రెవిన్యూ, అటవీ అధికారుల దౌర్జన్యాల్ని వ్యతిరేకిస్తూ సాగించిన పోరాటాలను, పొందిన విజయాలను ప్రజలెన్నటికీ మరవలేరన్నారు. విప్లవ నిర్మాణాలలో పనిచేస్తున్న ప్రజాఉద్యమ కార్యకర్త, ఆదివాసీ నాయకుడిపై ‘పోలీసు ఏజెంట’ని ముద్రవేసి హత్యగావించిన తప్పిదాన్నుండి మావోయిస్టులెన్నటికీ తప్పించుకోజాలరన్నారు.

ఎఐకెఎమ్‌కెఎస్ కో-కన్వీనర్ కా॥ సింహాద్రి ఝూన్సి కా॥ అర్జున్ హత్య గురించి మాట్లాడుతూ మావోయిస్టులు ఒక పథకం ప్రకారం సాగించిన రాజకీయ హత్యగా పేర్కొన్నారు. మావోయిస్టులు కా॥ అర్జున్‌ను హత్య చేయటమనేది ప్రజాతంత్రవాదుల, మేధావుల నడుమ ఒక చర్చనీయాంశంగా మారిందన్నారు. తమను చుట్టుముడుతున్న ప్రశ్నల నుండి తప్పించుకోలేని పరిస్థితుల్లో కామ్రేడ్ అర్జున్‌పైనా, కామ్రేడ్ అర్జున్ పనిచేస్తూ వచ్చిన మా రాజకీయ నిర్మాణంపైనా ఆధారరహిత, నిందా పూర్వక, విచక్షణారహిత దుష్ప్రచారానికి పూనుకొని దిగజారి మాట్లాడుతున్నారన్నారు. మేధావులను, ప్రజాతంత్రవాదులను మభ్యపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపేందుకు తామే వివిధ ప్రయత్నాలు చేసినప్పటికీ, కానూసన్యాల్ పార్టీ నాయకత్వం దానికి ప్రతిస్పందించ లేదని పూర్తి విరుద్ధమైన అవాస్తవాలను ప్రచారం చేసేందుకు కూడా వెనుకాడటం లేదని కా॥ ఝూన్సి వివరిస్తూ భూమి-భుక్తి- విముక్తి కోసం పోరుమార్గాన ముందుకు సాగటమే కా॥ అర్జున్‌కు అర్పించే నివాళిగా పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. కోటయ్య మాట్లాడుతూ ఆదివాసుల భూములకు కనీసపాటి రక్షణ కల్పించే ఆంధ్రప్రదేశ్‌లోని 1/70 చట్టం, ఒడిషాలోని 2/56 చట్టాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయకుండా మరోవైపున ఆదివాసుల అటవీ భూములను బడా, బహుళజాతి సంస్థలకు కట్టబెడ్తున్న తీరును వివరించారు. ముంచుకువస్తున్న సామ్రాజ్యవాద ముప్పుకు వ్యతిరేకంగా ఆదివాసుల హక్కుల రక్షణకై, ప్రజాతంత్ర, విప్లవ శక్తులందరూ ఏకతాటిపై నిలిచి పోరాడాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు కా॥ అర్జున్‌ను హత్యగావించటం ఏవర్గ ప్రజల ప్రయోజనాలకు తోడ్పడుతుందో స్పష్టమేనన్నారు. ఈ విధమైన చర్యలకు మావోయిస్టులు స్వస్తి పలకాలన్నారు. ఈ సభలో ఇంకా ‘వేదాంత వ్యతిరేక పోరాట కమిటి’ కన్వీనర్ లింగరాజ్ ఆజాద్, చాషీమూలియా ఆదివాసీ సంఘం ఒడిషా రాష్ట్ర అధ్యక్షులు కా॥ బ్రహ్మానందమాలిక్, రైతుకూలీ సంఘం

(తరువాయి 6వ పేజీలో)

# అనైతిక ఔషధ ప్రయోగాలకు పాల్పడిన యాక్సిస్ కంపెనీ లైసెన్సు పునరుద్ధరణ

**పేదరికం** అజ్ఞానాలను ఆసరా చేసుకుని, అన్ని నియమ, నిబంధనలనూ తుంగలో తొక్కి పేద ప్రజలపై ఔషధ ప్రయోగాలను బహుళజాతి ఔషధ కంపెనీలు భారత దేశంలో సాగిస్తున్నాయి. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరుతున్న విదేశీ మారకద్రవ్యాన్ని చూసి మురిసిపోతూ వేలకోట్ల రూపాయలు గడించే ఉజ్వల భవిష్యత్తువున్న పరిశ్రమగానూ; వేలాది మందికి ఉపాధి కల్పించేదిగానూ వర్ణించిన పాలకులు దీనికి సకల సౌకర్యాలూ కల్పించారు. అయితే ఈ ఔషధ ప్రయోగాలు నిర్వహించేవారు పాటించవలసిన నియమ నిబంధనలను మాత్రం అమలు జరిపించటంలో ఏ మాత్రం శ్రద్ధ చూపకుండా ప్రభుత్వం వూరకుండిపోయింది. విదేశీ మారక ద్రవ్యం కోసం ప్రజల ఆరోగ్యాన్ని బలిపెట్టింది. భారత బడా బూర్జువా వర్గం కూడా సామ్రాజ్యవాద దేశాల మందుల కంపెనీల తరఫున ప్రయోగాలు నిర్వహించి లాభాలు మూటగట్టుకునేందుకుకే పూనుకున్నారు. చివరకు, ఆదాయం వున్నా వైద్యవృత్తిని వదలివేసి డాక్టర్లు కూడా ఔషధ ప్రయోగ కంపెనీలలో చేరుతున్నారు. వీరంతా ఈ ప్రయోగాల నిర్వహణలో పాటించవలసిన నియమ నిబంధనలను గాలికి వదలి వేయటమే కాక, అనైతిక పద్ధతులకు కూడా పాల్పడుతున్నారు.

గర్భాశయ ముఖద్వారానికి వచ్చే కాన్సరు వ్యాధి నివారించే టీకాను పరీక్షించేందుకు బిల్‌గేట్స్ యిచ్చిన నిధులతో ఔషధ ప్రయోగాలకు భారత పాలకులు అనుమతించారు. ఖమ్మం జిల్లాలోని గిరిజన హాస్టళ్లలోని విద్యార్థినులను దీనికి ఒప్పించమని వార్డన్ల, ప్రధానోపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రయోగాల ఫలితంగా కొందరు గిరిజన బాలికలు మృతి చెందగా, ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇతర జబ్బులతో చనిపోయారనీ ప్రకటించి ప్రభుత్వం ఈ అన్యాయాన్ని దాచిపెట్టింది.

తిరిగి జూన్ నెలలో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో ఔషధ ప్రయోగాల ఫలితంగా పేద మహిళలు అనారోగ్యం పాలయ్యారని బయల్పడటంతో, వారిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి, వారిపై ఎలాంటి దుష్ప్రభావాలూ లేవంటూ రెండు రోజుల తర్వాత పంపివేసింది. ప్రజాందోళన రావటంతో విచారణకు ఆదేశించింది. ప్రయోగాలు చేసిన కంపెనీల లైసెన్సును తాత్కాలికంగా నిలిపివేసింది. వాటిలో యాక్సిస్ కంపెనీ ఒకటి.

యాక్సిస్ కంపెనీ లైసెన్సును నిలిపివేస్తూ భారత ఔషధ నియంత్రణ సంచాలకుడు చెప్పిన కారణాలు యిలా వున్నాయి. ప్రయోగాలకు సిద్ధమయ్యేవారిని ఎంచుకోవటంలోనూ, వారికి ఔషధ ప్రయోగాల గురించిన సమాచారం అందించటలోనూ, వారి నుండి స్వచ్ఛంద అనుమతి పొందటంలోనూ, నైతిక కమిటి స్వతంత్రతలోనూ, నియమాలు పాటించలేదని ప్రాథమిక విచారణలో తేలినందున లైసెన్సు నిలిపివేస్తూ, పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్లు తెలిపింది. ఇది జరిగింది 2011 జూన్ 24న.

ఇది జరిగిన రెండు నెలలకు 2011 ఆగస్టు 24న యాక్సిస్ కంపెనీ లైసెన్స్‌ను పునరుద్ధరించారు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 25-8-2011). “మేము పూర్తి స్థాయి విచారణ జరిపి అంతిమ నివేదికను సమర్పించాము. దీనిపై డిసిజిఐ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సివుంది. కానీ లైసెన్సు నిలుపుదలను ఆపివేశారు. అది తిరిగి మామూలుగా ప్రయోగాలు సాగిస్తున్నది” అని డిసిజిఐలోని ఉన్నతాధికారి తెలిపారు. కంపెనీ నియమించిన నైతిక కమిటీ స్వతంత్రంగా వ్యవహరించటంలేదనీ, కళ్లు మూసుకుని ఆమోదముద్ర వేస్తున్నదని కూడా ఆయన తెలిపాడు (పై పత్రిక నుండి) ప్రాథమిక విచారణలోనే మిగిలిన విషయాలలోకూడా నియమాలు పాటించలేదని తేలింది. అయినా విచారణ నివేదికపై నిర్ణయం తీసికోకుండా ప్రక్కనపెట్టి యాక్సిస్‌కుపెనీ లైసెన్సును పునరుద్ధరించారు. ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చడానికి విచారణ తంతు సాగించారు తప్ప అక్రమాలు సాగిస్తున్న కంపెనీలపై చర్య తీసుకునే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని స్పష్టమైంది.

నైతిక కమిటీ పని తీరు చూద్దాం. ఈ మందు ప్రయోగించిన వ్యక్తి నెంబరు 2, పేరు ఇలా ధనలక్ష్మి, ఊరు పిడుగురాళ్ల. ప్రయోగం జరిపినది 2011 జనవరి నెలలో, మందు ప్రయోగాల ఫలితాలను సమీక్షించి నైతిక కమిటీ ఆమోదిస్తూ సంతకం చేసినది 2010 మే 6వ తేదీన. మందు ప్రయోగం తర్వాత ఆమె ఆరోగ్యంగా వుందని తెలిపేందుకు ఆమెను ప్రశ్నించి ఆమె సమాధానాలు వ్రాసిన ఫారంలో నమోదు చేసిన తేదీ 2011 జనవరి 28. దానిని ఆమోదిస్తూ నైతిక కమిటీ సంతకం చేసిన తేదీ 2010 నవంబరు 8. ప్రయోగించిన మందుకు ఆమె శరీరం ప్రతిస్పందించిన వివరాలను నమోదు చేసిన ఫారంలో వేసిన తేదీ 2011 జనవరి 29. కాగా దీనిని ఆమోదిస్తూ నైతిక కమిటీ సంతకం చేసిన తేదీ 2010 నవంబరు 10. (వివరాలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 26-8-201). అంటే పరీక్షలు జరుగకముందే ఫలితాలు ఆమోదిస్తూ సంతకాలు జరిగాయి. అంటే ఖాళీ ఫారాలపై గంపగుత్తగా నైతిక కమిటీ సంతకాలు చేసి యిచ్చింది.

ఇలా ఎందుకు జరుగుతోంది? కొంత వివరంగా పరిశీలిద్దాం. అమెరికాకు చెందిన మందుల కంపెనీ మైలాన్. ఇటీవల వైఎస్ జగమ్మోహన్‌రెడ్డిపై సిబిఐ దాడులలో బయటపడ్డ నిమ్మగడ్డ ప్రసాద్. ఈయనకు చెందిన మ్యాట్రిక్స్ ఫార్మా అన్న మందుల కంపెనీని మైలాన్ కొనివేసింది. (500 కోట్ల రూ॥ ప్రీమియంతో నని అభిజ్ఞ వర్గాల కథనం). ఎక్సిమిస్టేన్ అన్న కాన్సరు మందును మనుషులపై ప్రయోగించే పనిని మైలాన్ కంపెనీ యాక్సిస్ క్లినికల్స్ ప్రైవేటు లిమిటెడ్ అన్న కంపెనీకి కాంట్రాక్టుకిచ్చింది.

అరబిందో ఫార్మా లిమిటెడ్ హైద్రాబాదులోని మందుల కంపెనీలలో పెద్దవాటిలో ఒకటి. ఔషధ ప్రయోగాలు నిర్వహించేందుకు అరబిందో ఫార్మా పెట్టిన అనుబంధ కంపెనీయే యాక్సిస్ క్లినికల్స్, ఎక్సిమిస్టేన్ మందును ప్రయోగించేందుకు డిసిజిఐ నుండి 2010 జనవరిలో అనుమతి పొందింది. 2011 జనవరి 28 నుండి ఫిబ్రవరి 18 వరకూ ఈ మందును 48 మందిపై ప్రయోగించింది.

ఇన్నాళ్ల తర్వాత బయటకొచ్చిన వివరాలివి. ఇంకెన్ని మందులు ఇంకెంత మందిపై ప్రయోగాలు జరిగాయో తెలియదు. ఇంత వ్యతిరేక ప్రచారం జరిగినా కంపెనీలు పత్రికలముందు ఏమాత్రం సిగ్గులేకుండా తమ గొప్పదనాన్ని చెప్పుకున్నాయి. “మధుమేహ వ్యాధిలో ఇప్పుడే కనుగొన్న మందులను ప్రయోగించే పోటీలో మా కంపెనీ అందరికంటే ముందుంది. మధుమేహ వ్యాధికొరకున్న ప్రత్యేక ఆస్పత్రులతో మాకున్న సంబంధాలతో 27వేల మంది రోగులు మా లిస్టులో వున్నారు. ఒక అమెరికా కంపెనీ తన మందు ప్రయోగానికి 400మంది మధుమేహ రోగులు కావాలంటే ఆ కాంట్రాక్టు మాకే దక్కింది” అని ఒక కంపెనీ గొప్పలు చెప్పుకుంది. (డక్కన్ క్రానికల్ 2011 జూలై 23).

విదేశీ కంపెనీలకూ, దేశంలో పెట్టుబడిదారులకూ లాభాలు కట్టబెట్టడమే తమ పనిగా భావించే నేతలే నేడు దేశాన్ని పాలిస్తున్నారు. ఈ లాభార్జనకు ప్రజలనూ, వారి ఆరోగ్యాన్ని బలిపెట్టడానికి కూడా వారు వెనుకాడరని ఔషధ ప్రయోగాల తీరు తెల్పుతున్నది. నియమ నిబంధనలన్నీ తుంగలో తొక్కిందని బయటపడ్డా, దానిపై ఎలాంటి చర్యా తీసుకోకుండా, తిరిగి నీ అక్రమాలు సాగించుకొమ్మని యాక్సిస్ కంపెనీకి అనుమతినిచ్చిన పాలకులు ప్రజలపట్ల తమ బాధ్యతా రాహిత్యాన్ని మాత్రమేకాక, సామ్రాజ్యవాదుల చెప్పులను నెత్తిన పెట్టుకునే బానిస స్వభావాన్ని మరోమారు బయట పెట్టుకున్నారు. D

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010